Follow: @ANNTELUGU

ANN తెలుగు

08-04-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 127 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## పట్టాభిషిక్తుడైన రామయ్య

**పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్**

**గిరిజన మ్యూజియం ప్రారంభించిన జిష్ణు దేవ్ వర్మ**

**మహా, భద్రాచలం :** భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం కన్నుల పండుగగా జరిగింది. అశేష భక్త జనులు పట్టాభిషిక్తుడైన రామయ్యను చూసి పులకించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మిథిలా స్టేడియం లోని కళ్యాణ మండపంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరగగా, అదే వేదికపై సోమవారం పుష్యమి నాడు రామయ్యకు మహా పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.

మిగతా 2లో

### టాప్ న్యూస్

మే 6 అర్ధరాత్రి నుంచి

**ఆర్టీసీ సమ్మె**

- 7వ తేదీ ఫస్ట్ షిఫ్ట్ డ్యూటీ నుంచి విధుల బహిష్కరణ
- నేటికీ జీతాలు రాలేదని ఉద్యోగుల ఆవేదన
- విధిలేని పరిస్థితులలో సమ్మెకు వెళ్తున్నామన్న జేఏసీ

02

నేటి నుండి అహ్మదాబాద్ లో ఎఐసిసి

**కీలక సమావేశాలు**

- హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి, మహేష్ గౌడ్

02

వక్ఫ్ సవరణ చట్టంపై

**అత్యవసర విచారణ**

- పిటిషన్ల లిస్టింగ్‌కు సీజేఐ ధర్మాసనం అంగీకారం



02

## ఏడుగురు ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

**విజయశాంతి, అద్దంకి సహ మరో ఐదుగురు బాధ్యతల స్వీకరణ**

**హాజరైన మంత్రులు కిషన్ రెడ్డి, ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర శాసనమండలి వేదికగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు సోమవారం ప్రమాణ్య స్వీకారం చేశారు. పట్టభద్రులు, టీచర్, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎనిమిది ఐంది ఎమ్మెల్సీలుగా గెలిచిన విషయం తెలిసిందే. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. శ్రీపాల్ రెడ్డి, శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం, విజయశాంతి. మల్కా కొమురయ్య, అంజిరెడ్డి తదితరులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఎనిమిది మంది ఎమ్మెల్సీలలో ఏడుగురు ఎమ్మెల్సీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనా దాసోజు శ్రవణ్ మరోరోజు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ నుంచి విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కరీంనగర్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య విజయం సాధించారు.

మిగతా 2లో

## ఈ బంధం దృఢమైనది

**సీఎం, డిప్యూటీ సీఎం తో సింగపూర్ ప్రతినిధి బృందం భేటీ**





**హైదరాబాద్, మహా :** గ్రీన్ పవర్, రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ పునర్జీవం, విద్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య రంగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సచివాలయంలో సింగపూర్ కాన్సుల్ జనరల్ ప్రతినిధి బృందంతో భట్టి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్ కాన్సల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ మాట్లాడుతూ తెలంగాణతో ఆర్థిక సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని, డిప్యూటీ సీఎం సహకారం, సందేశం కావాలంటూ పాంగ్ కోరారు.

మిగతా 2లో

## 2 లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేస్తాం

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**మహా :** తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కాన్సూలేట్ జనరల్ ఆఫ్ సింగపూర్ 'ఎడ్గర్ పాంగ్' నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాద పూర్వకంగా కలిశారు.

మిగతా 2లో

# మార్కెట్లకు బ్లాక్ మండే



**ఒక్క రోజే.. భారత్‌లో 20 లక్షల కోట్ల సంపద ఆవిరి**

ట్రంప్ వచ్చాక.. భారత ఇన్వెస్టర్లకు

**రూ.45లక్షల కోట్లు లాస్**

భారత్, జపాన్, దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్, తైవాన్ లకు భారీ నష్టం

అంబానీ, అదానీ, జిందాల్, నాడార్ నలుగురివే 85వేల కోట్లు ఖతం

90 దేశాలపై ట్రంప్ ఎఫెక్ట్.. బెంబేలెత్తిపోతున్న ఇన్వెస్టర్లు

**మహా, బిజినెస్ డెస్క్:**

ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం కుదేలయ్యాయి. సెకన్ల వ్యవధిలో మార్కెట్లో రూ.లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తీవ్రమై.. అమెరికాచైనా పరస్పరం భారీ మొత్తంలో పన్నులు విధించుకోవడంతో ఈ దారుణ పరిస్థితి తలెత్తింది. ట్రంప్ దెబ్బకు ఒక్క అమెరికా, భారతే కాదు.. ప్రపంచంలోని మార్కెట్లన్నీ షేక్ షేకవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరి కొరివితో తలగోక్కుంటున్నట్లుంది. ఆయన ప్రారంభించిన వాణిజ్యయుద్ధం దెబ్బకు ప్రపంచంలోని ప్రధాన సూచీల్లో ఒక్కటీ లాభాల్లో లేవు. దాదాపు 90 దేశాలపై ట్రంప్ భారీగా ప్రతీకార పన్నులు విధించడంతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. ఆసియాలోని జపాన్, దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్, తైవాన్, భారత్ ప్రధాన సూచీలు మొత్తం కనీసం 3 నుంచి 10శాతంలోపు నష్టాలను నమోదు చేశాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి భారత ఇన్వెస్టర్ల సంపద పెద్ద మొత్తంలో ఆవిరైపోయింది. మన దేశంలో సుమారు రూ.45.57 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కరిగిపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జనవరి 20 నాటికి మన దేశంలో రూ.4,31,59,726 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉండేది. అది కాస్తా ఇపుడు రూ. 3,86,01,961 కోట్లకు తగ్గింది. సోమవారం ఒక్కరోజే ఇన్వెస్టర్ల సంపద రూ. 20.16 లక్షల కోట్లు కరిగిపోయింది. సెన్సెక్స్ ఒక దశలో 5.22 శాతానికి పైగా పతనమైపోయింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల విలువ 4.5 ట్రిలియన్ డాలర్లకు పడిపోయింది. టాటా స్టీల్, టాటా మోటార్స్ 10శాతానికి పైగా నష్టపోయాయి. ఇక ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీ వంటి దిగ్గజ సంస్థల షేర్ల విలువ భారీగా పతనమైంది. ఏకంగా 517 కంపెనీల షేర్లు లోయర్ సర్క్యూట్‌కు పడటం గమనార్హం. ఈ ప్రభావం దేశీయ కుబేరులపైనా తీవ్రంగానే పడింది. టాప్4 కుబేరుల సంపద సోమవారం ఒక్కరోజే 10 బిలియన్ డాలర్లకు పైగా (భారత కరెన్సీలో దాదాపు రూ.85వేల కోట్లు) కరిగిపోయింది. ఈ మేరకు ఫోర్బ్స్ రియల్ టైమ్ బిలియనీర్ జాబితా గణాంకాలు వెల్లడించాయి.


### ఆ నలుగురికే రూ.85 వేల కోట్ల లాస్



అపర కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేర్లు నేటి ట్రేడింగ్‌లో భారీగా పతనమయ్యాయి. నిఫ్టీలో ఈ కంపెనీ షేరు విలువ దాదాపు 3.5శాతం కుంగింది. ఇంట్రాడేలో 7.4 శాతం నష్టంతో 52 వారాల కనిష్ఠాన్ని తాకింది. దీంతో అంబానీ వ్యక్తిగత నికర సంపద ఏకంగా 3.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.30వేల కోట్లు) తగ్గి 87.7 బిలియన్ డాలర్లకు చేరింది.



అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు కూడా 5శాతం మేర నష్టపోయాయి. దీంతో ఈ సంస్థ అధినేత గౌతమ్ అదానీ నికర సంపదలో 3 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25వేల కోట్లు) ఆవిరయ్యాయి. ప్రస్తుతం ఆయన మొత్తం ఆస్తుల విలువ 57.3 బిలియన్ డాలర్లకు తగ్గినట్లు ఫోర్బ్స్ పేర్కొంది.



ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో ఐటీ షేర్లు భారీగా కుదేలయ్యాయి. దిగ్గజ సంస్థ హెచ్‌సీహెల్ టెక్నాలజీస్ షేరు విలువ 3.3శాతానికి పైగా కుంగింది. దీంతో ఈ కంపెనీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ వ్యక్తిగత నికర సంపద 1.5 బిలియన్ డాలర్లు (రూ.12వేల కోట్లు) తగ్గి 30.9 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.



ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ నికర సంపద సోమవారం 2.2 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.18వేల కోట్లు) మేర కుంగి 33.9 బిలియన్ డాలర్లకు చేరింది. నేటి ట్రేడింగ్‌లో జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ షేర్లు దాదాపు 7శాతం పతనమయ్యాయి.

### రూపాయి విలువ కూడా ఢమాల్


మార్కెట్ సెషన్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 19 పైసలు పతనమై రూ.85.63కు చేరింది. ప్రపంచ వాణిజ్య యుద్ధం తీవ్రమై.. అమెరికా-చైనా పరస్పరం భారీ మొత్తంలో పన్నులు విధించుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో ఆర్బీఐ సమావేశంపై ఇన్వెస్టర్లు దృష్టిపెట్టారు. బుధవారం నాడు కేంద్ర బ్యాంకు నిర్ణయాలు వెలువడే అవకాశాలు ఉన్నాయి. వీటిపైనే రూపాయి భవిష్యత్తు ప్రయాణం ఆధారపడి ఉంది. ప్రస్తుత ప్రపంచ అస్థిర పరిస్థితుల్లో వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గించే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | మంగళవారం, హైదరాబాద్ | 08-04-2025
ANN తెలుగు

# ట్రిపుల్ఆర్ కు సర్వీస్ రోడ్లు

## ఎన్ హెచ్ఏఐ నిర్ణయం.. ప్రజాభిప్రాయానికి అనుకూలంగా నిర్ణయం
## మొదలైన ట్రాఫిక్ సర్వే .. వాహనాల సంఖ్యను బట్టి సర్వీస్ రోడ్ల విస్తరణ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుందని భావిస్తున్న హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు విషయంలో ఎన్హెచ్ఏఐ సమీప ప్రాంతాల ప్రజలకు అదిరిపోయే వార్త చెప్పింది. రీజినల్ రింగ్ రోడ్డు పొడవునా సర్వీసు రోడ్లు నిర్మించాలని ఎన్ హెచ్ఏఐ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరనుందని భావిస్తోంది. మొదట సర్వీసు రోడ్లు అవసరం లేదని భావించినప్పటికీ ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఎన్ హెచ్ఏఐ తన నిర్ణయాన్ని మార్చుకుంది. హైదరాబాద్ నగరం చుట్టూ ఇప్పటికే నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును సర్వీసు రోడ్లతో కలిపి నిర్మించారు. కాగా ఈ సర్వీస్ రోడ్లు వాహనదారులకు బాగా ఉపయోగపడుతున్నాయి. ఇప్పుడు ఆర్ఆర్ఆర్కు కూడా సర్వీసు రోడ్లు నిర్మించాలని నిర్ణయించారు. మొదట రూపొందించిన ప్రాజెక్టు డిజైన్లో సర్వీసు రోడ్డు ప్రస్తావన లేదు. దీనిని సాధారణ జాతీయ రహదారిలా కాకుండా యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్ప్రెస్ వేగా నిర్మిస్తున్నారు. అందుకే సర్వీసు రోడ్లు అవసరం లేదని తొలుత నిర్ణయించారు. అయితే సర్వీసు రోడ్లు లేకపోతే తమకు ఉపయోగం ఉండదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కచ్చితంగా సర్వీసు రోడ్లు కావాలని ప్రజాభిప్రాయ సేకరణ సభల్లో కోరుతున్నారు. మొదట ప్రజల అభ్యర్థనను ఎన్ హెచ్ఏఐ తోసిపుచ్చింది. కానీ.. తాజాగా చోటు చేసుకున్న పరిణామాలతో తన నిర్ణయాన్ని మార్చుకుంది. రోడ్డు డిజైన్ను మార్చి




సర్వీసు రోడ్డు ఆప్షన్ను చేర్చింది. కీలక ప్రాజెక్టుల్లో జాప్యాన్ని నివారించడానికి వాటిని పీఎం గతి శక్తి పర్యవేక్షణలో ఉంచుతున్నారు. పీఎం గతి శక్తిలో భాగంగా ఉన్న నెట్వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్ పీజీ) ఇటీవల సమావేశమైంది. ఈ సమావేశంలో ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టుపై చర్చించారు. ఈ ప్రాజెక్టు వల్ల చుట్టు పక్కల ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. కొత్త ఎస్ఈజెడ్ లు, శాటిలైట్ టౌన్షిప్లు వస్తాయని అంచనా వేశారు. అప్పుడు స్థానిక ప్రజల కోసం సర్వీసు రోడ్లు అవసరం అవుతాయని ఎన్ పీజీ అభిప్రాయపడింది. ఈ రోడ్డు నిర్మించే ప్రాంతంలో ట్రాఫిక్ సర్వే చేస్తున్నారు. స్థానిక రోడ్లపై ప్రస్తుతం వాహనాల రద్దీ ఎలా ఉందో తెలుసుకుంటున్నారు. 2021-22లో నిర్వహించిన ట్రాఫిక్ స్టడీతో పోలిస్తే కొత్త అధ్యయనంలో వాహనాల సంఖ్య పెరిగితే, రాబోయే ఐదారేళ్లలో రెట్టింపు అవుతుందని అంచనా వేస్తున్నారు. ప్రధాన రహదారి మీదుగా కాకుండా, ఇతర రోడ్లతో కలిసే వాహనాల సంఖ్య కూడా పెరుగుతుందని అంచనా వేశారు. సర్వీసు రోడ్లు లేకపోతే ఆ వాహనాలకు ఈ రోడ్డు ఉపయోగపడదని అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం చేస్తున్న ట్రాఫిక్ స్టడీలో వాహనాల సంఖ్య బాగా పెరిగితే సర్వీసు రోడ్లు కచ్చితంగా నిర్మించాలని ఎన్ హెచ్ఏఐకి సిఫారసు చేశారు. వాహనాల సంఖ్య బాగా పెరిగిందని అంచనాకు వచ్చిన తరువాత, సర్వీసు రోడ్లు నిర్మాణానికి వీలుగా ఆర్ఆర్ఆర్ డిజైన్లు సిద్ధం చేస్తున్నారు. ఆర్ఆర్ఆర్కు రెండు వరుసల సర్వీసు రోడ్డును డిజైన్ చేస్తున్నారు. మొదట 5.5 మీటర్లతో ఒక వరుస సర్వీసు రోడ్డును నిర్మించాలని అనుకున్నారు. వాహనాల రద్దీ పెరిగిన తర్వాత దాన్ని 7.5 మీటర్లకు, రెండు వరుసలకు విస్తరించాలని నిర్ణయించారు. సర్వీసు రోడ్లు ఫ్లైఓవర్లు ఉన్న చోట ఉండవు. ఫ్లైఓవర్లు, అండర్పాస్లు ఉన్న చోట వాటి దిగువగా నీటి ప్రవాహం కోసం ఏర్పాటు చేసే చానళ్ల ద్వారా యూ టర్న్ తరహాలో ఉండి మళ్లీ ప్రధాన రహదారిని ఆనుకుని ముందుకు వెళ్తాయి. ప్రధాన రహదారి, దిగువ ప్రాంతాలకు కేటాయించిన అలైన్మెంట్లో కొన్ని మార్పులు చేస్తున్నారు. ట్రాఫిక్ స్టడీ వివరాలను కేంద్రానికి పంపిన తర్వాత, ఢిల్లీ అధికారులు పరిశీలిస్తారు. ఆ తరువాత తుది నిర్ణయం తీసుకుని స్థానిక ఎన్ హెచ్ఏఐ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారు. ట్రాఫిక్ స్టడీ వివరాలను కేంద్రానికి సమర్పించిన తర్వాత, ఢిల్లీ స్థాయిలో అధికారులు పరిశీలించి తుది నిర్ణయం తీసుకుని స్థానిక ఎన్హెచ్ఏఐ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నారు.

# పట్టాభిషిక్తుడైన రామయ్య

## పట్టు వస్త్రాలు సమర్పించిన గవర్నర్
### గిరిజన మ్యూజియం ప్రారంభించిన జిష్ణు దేవ్ వర్మ



(మొదటి పేజీ తరువాయి)

పట్టాభిషేకం జరుగుతుండగా రామయ్య రాజసం చూసి భక్తులు పరవశించిపోయారు.ఈ ఉత్సవానికి తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాజ్యాధికారి హోదాలో పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సోమవారం రామాలయంలో ఉదయం నిత్య విధి అనంతరం 10 గంటలకు మిథిలా స్టేడియం లోని ప్రాకార మండపంలో వేంచేపు చేసి అలంకార ఆరాధన గావించి , నిర్విఘ్నతాసిద్ధి కొరకు శ్రీ విశ్వక్సేనార్చన, ద్రవ్యశుద్ధి కొరకు పుణ్యాహ వచనము ముగించుకొని పుణ్యాహజలములచే పట్టాభిషేక ప్రక్రియ ఆరంభించారు . ఇందుకుగాను మంటపారాధన గావించి టపమునందు ముందు చతుస్సముద్రోదక కలశములు మధ్యయందు 500నదుల తీర్థ కలశములను (శ్రీమద్రామయణము నందు తెలుపబడినట్లు) స్థాపించి, అర్చించి, పట్టాభిషేక సర్గపారాయణ గావించి అనన్తరము ఆయా కలశ ఉదకములచే పట్టాభిషేక మంత్ర పఠన పూర్వకముగా శ్రీస్వామి వార్కి పట్టాభిషేకము జరిపి, స్వర్ణకిరీట, పాదుకా, హెూరాదులు, ఛత్రచామరాది లాంఛనములు సమర్పించి నివేదన గావించి మంగళ నీరాజనములతో పట్టాభిషేక ప్రక్రియ ముగించారు . భక్తులపై మంత్ర జలాన్ని చిలకరించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే లు వెంకట్రావు, కోరం కనకయ్య,కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్ పి రోహిత్ రాజ్ స్వాగతం పలికారు. గవర్నర్ ఐ టీ సి గెస్ట్ హౌస్ నందు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్వామి వారిని దర్శించుకుని పట్టాభిషేక మహోత్సవంకు హాజరయ్యారు.పట్టాభిషేకం అనంతరం ఐ టీ డి ఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గిరిజన మ్యూజియం ను ప్రారంభించారు.సాయంత్రం స్వామి వారికి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.

# మీనాక్షి సెక్రటేరియట్ లో సమీక్షించడమేంటి?

- ఆమె రివ్యూ చేయాలంటే.. గాంధీ భవన్ లో చేయాలి?
- తెలంగాణ సచివాలయానికి ఆమెకు సంబంధం ఏంటి?
- మండిపడ్డ బిజెపి ఎంపీ రఘునందన్

**మహా:** కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ఛార్జి మీనాక్షి నటరాజన్ పై బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై సోమవారం కౌన్సిల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చేయాల్సిన పని ముఖ్యమంత్రి చేయాలన్నారు. మీనాక్షి నటరాజన్ రివ్యూ చేయాలంటే గాంధీ భవన్ లో చేయాలన్నారు. సీఎంకు, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్ ఛార్జికి మధ్య గ్యాప్ ఏంటో వారు తేల్చుకోవాలన్నారు. వారి మధ్య గొడవేంటో కాంగ్రెస్ హైకమాండ్ దృష్టి పెట్టిపెట్టాలన్నారు. ఇన్చార్జి ఏం చేస్తుంది? సీఎం ఏం చేస్తున్నారు? ఎవరేం చేస్తున్నారు? అనేది పార్టీ చూడాలన్నారు. సీఎంను మారుస్తారా? హుస్సేన్ సాగర్ లో దూకుతారా? అనేది కాంగ్రెస్ పార్టీ ఇష్టమన్నారు. మీనాక్షి నటరాజన్ తీరు సరికాదన్నారు.

# తెలంగాణ సర్కారుకు దియా మీర్జా కౌంటర్

## నేషనల్ ఇష్యూగా 400 ఎకరాలు.. సీఎంకు తలనొప్పి

**హైదరాబాద్, మహా:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం రాష్ట్రంలో హాట్ టాపిక్గా మారింది. ప్రభుత్వం 400 ఎకరాల భూమిని వేలం వేయకుండా అటవీ సంపదను, జీవరాశులను కాపాడాలని హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనకు ప్రతిపక్షాలు కూడా మద్దతు తెలపడంతో గచ్చిబౌలి భూముల ఇష్యూ నేషనల్ వైడ్గా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంతో లక్షల సంఖ్యలో చెట్ల నేలకొరుగుతున్నాయని.. జీవరాశులు చనిపోతున్నాయని.. అందుకు సంబంధించిన వీడియోలను విద్యార్థులు, రాజకీయ నాయకులు, సెలబ్రెటీలు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. బాలీవుడ్ నటి దియా మీర్జా కూడా గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సోషల్ మీడియా వేదికగా రియాక్ట్ అయ్యారు. ప్రకృతిని పరిరక్షించండి, జీవవైవిధ్యాన్ని కాపాడాలంటూ విద్యార్థుల నిరసనలు, చెట్ల నరికివేత, జంతువుల వధకు సంబంధించిన వీడియోలను ఆమె



షేర్ చేశారు. ఇదిలా ఉంటే.. గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్గా ఉంది. గచ్చిబౌలి భూముల వివాదానికి సంబంధించి సోషల్ మీడియాలో ఏఐతో క్రియేట్ చేసిన ఫేక్ వీడియోలు షేర్ చేస్తున్నారని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు సినీ, రాజీకయ ప్రముఖులు సోషల్ మీడియాలో ఏఐతో తయారు చేసిన వీడియోలు సర్క్యులేట్ చేశారని మండిపడ్డారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నటి దియా మీర్జా కౌంటర్ ఇచ్చారు.

### హాట్ కామెంట్స్

"400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూ ఇష్యూపై సీఎం రేవంత్ రెడ్డి కొన్ని వ్యాఖ్యలు చేశారు. అందులో ముఖ్యమైనది ఏఐతో క్రియేట్ చేసిన వీడియోలు షేర్ చేశారని. కానీ గచ్చిబౌలి ఇష్యూకి సంబంధించి నేను పోస్ట్ చేసిన వీడియోలు పూర్తిగా ఒరిజినల్వి. వాటిలో ఏ ఒక్కటి కూడా ఏఐతో రూపొందించినవి కావు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవి. మీడియా, తెలంగాణ ప్రభుత్వం అలాంటి వాదనలు చేసే ముందు వాస్తవాలను ధృవీకరించుకోవాలి" అని దియా మీర్జా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలకు నటి దియా మీర్జా అదే రేంజ్లో కౌంటర్ ఇవ్వడం హాట్ టాపిక్గా మారింది.

# ఏడుగురు ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

## విజయశాంతి, అద్దంకి సహా మరో ఐదుగురు బాధ్యతల స్వీకరణ
### హాజరైన మంత్రులు కిషన్ రెడ్డి, ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు



(మొదటి పేజీ తరువాయి)

అలాగే ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్రెడ్డి గెలిచారు.

**బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి కామెంట్స్..**

ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన అనంతరం బీజేపీ ఎమ్మెల్సీ అంజి రెడ్డి మాట్లాడుతూ, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్సీ గా గెలిచినందుకు సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాయకత్వానికి, గెలిపించిన ప్రతి కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలపై మండలిలో గొంతు విప్పుతానన్నారు. విద్యాసంస్థలకు పెండింగ్లో ఉన్న బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెచ్సీయూ భూములు అమ్మాలని ప్రభుత్వం చూస్తోందని, విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**మరో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ**

ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన మరో బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మాట్లాడుతూ.. తనను గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్ర నాయకత్వానికి, కేంద్ర నాయకత్వానికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వం అని రుజువు అయిందన్నారు. కలిసికట్టుగా పని చేసి రాష్ట్రంలో కాషాయ జెండా ఎగురవేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**జీవితాంతం కాంగ్రెస్ తోనే ఉంటా : అద్దంకి దయాకర్**

కష్టపడి పని చేసే కార్యకర్తను తప్పకుండా గుర్తిస్తుందని అందుకు ఉదాహరణ తనకు ఎమ్మెల్సీ పదవిని కాంగ్రెస్ అధిష్టానం కట్టబెట్టడమేనని అద్దంకి దయాకర్ అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీకి ఎంతో రుణ పడి ఉన్నానని, జీవితాంతం పార్టీ కోసం పని చేస్తానని అన్నారు. ధన వేతనంలో 25 శాతం వేతనాన్ని కాంగ్రెస్ పార్టీకి ఇస్తానని పేర్కొన్నారు. కొద్ది రోజుల తర్వాత మరో 25 శాతం వేతనాన్ని తెలంగాణ అమర వీరుల కుటుంబాలకు అందిస్తానని తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ , అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు.

# సవరించేదేలే..

## ఓవైపు ప్రపంచ మార్కెట్లు కుదేలు.. ట్రంప్ ఆసక్తికర ప్రకటన

**మహా:** ట్రంప్ టారిఫ్ల దెబ్బకు.. ఆసియా, యూరప్ దేశాల స్టాక్ మార్కెట్లు భారీగా పతనం అవుతున్నాయి. అయినా కూడా వాణిజ్య సుంకాల విషయంలో తన నిర్ణయమే కరెక్ట్ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో వాటిని "సవరించే దే లే.." అని భీష్మించుకుని కూర్చున్నారు. అయితే అమెరికా సహా ప్రపంచ దేశాల మార్కెట్లు కుదేలు అవుతున్న వేళ తాజాగా మరోసారి ఆసక్తికర ప్రకటన చేశారు. చాలాకాలంగా అన్యాయానికి గురైన అమెరికా, ప్రతీకార సుంకాల ద్వారా సంబంధిత దేశాల నుంచి బిలియన్ల డాలర్లు తీసుకు వస్తోంది. అన్నింటికంటే.. అతిపెద్ద దుర్వినియోగదారు దేశమైన చైనా మార్కెట్లు కుప్పకూలిపోతున్నాయి, ఆ దేశంపై సుంకాలను 34% పెంచినప్పటికీ.. ప్రతీకారానికి దిగొద్దన్న నా హెచ్చరికను పట్టించుకోలేదు. అమెరికా గత నాయకుల వల్లే దశాబ్దాలుగా వాళ్లు అడ్డగోలుగా సంపాదించున్నారు. ఇక.. అమెరికాను మళ్ళీ గొప్పగా తీర్చిదిద్దండి! అని ట్రూత్ సోషల్ లో ట్రంప్ పోస్ట్ చేశారు.

# కంచ గచ్చిబౌలి భూముల వివాదం

## కృత్రిమ మేథతో వీడియోలు సృష్టించి ప్రచారం చేశారు
### హైకోర్టును ఆశ్రయించిన రాష్ట్ర ప్రభుత్వం
### వాదనలు 24 న వింటామన్న కోర్టు

**హైదరాబాద్, మహా :** కంచగచ్చిబౌలి భూ వివాదంపై తెలంగాణ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. కృత్రిమ మేధ సాయంతో ఫేక్ వీడియోలు క్రియేట్ చేసి ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఏప్రిల్ 24న వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మేనక గురుస్వామి వాదనలు వినిపించారు. 400 ఎకరాల భూ వివాదంలో నకిలీ వీడియోలు, ఆడియో క్లిప్పింగ్స్ తయారు చేసినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బుల్డోజర్లను చూసి నెమళ్లు, జింకలు పారిపోతున్నట్లు ఫేక్ ఫొటో, వీడియోలు క్రియేట్ చేశారని పిటిషన్ లో వివరించారు. ఇటీవలే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను లాక్కున్నట్లుగా సోషల్ మీడియా నెట్వర్క్ ద్వారా కృత్రిమంగా వివాదం సృష్టించటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. కంచె గచ్చిబౌలి భూములకు సంబంధించి కోర్టులో ఉన్న కేసులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పోలీసు అధికారులు ఏఐ టెక్నాలజీతో కృత్రిమ వీడియోల ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేక ప్రచారం చేసినట్లు తెలిపారు. దీంతో న్యాయపరంగా ముందుకు వెళ్ళాలని సీఎం ఆదేశించిన విషయం తెలిసిందే.

# 2 లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేస్తాం

## రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

(మొదటి పేజీ తరువాయి)

'ఎమర్జింగ్ టెక్నాలజీస్' కు హబ్ గా తెలంగాణను మార్చేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వారికి వివరించారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నెలకొల్పుతున్న ఫ్యూచర్ సిటీ, అక్కడే ఏర్పాటు చేయబోతున్న ఏఐ యూనివర్సిటీ గురించి తెలిపారు. ఫ్యూచర్ సిటీలో భాగస్వామ్యమయ్యేందుకు అనేక అంతర్జాతీయ సంస్థలు ముందుకొచ్చాయన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ) కు హబ్ గా హైదరాబాద్ మారుతుందన్నారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీ, ఇతర రంగాలకు చెందిన 70 జీసీసీలు ప్రారంభమయ్యాయని చెప్పారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమల ఏర్పాటును ఒక్క హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... వరంగల్, కరీంనగర్ లాంటి నగరాలకు విస్తరించేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలపై స్థానిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని ప్రతినిధుల బృందాన్ని కోరారు. టెక్నాలజీ, స్కిల్ డెవలెప్ మెంట్, ఇతర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో కాన్సూల్ వైష్ణవి వాసుదేవన్, ఫస్ట్ సెక్రటరీ(ఎకానమిక్) వివేక్ రఘు రామన్, ఎంటర్ ప్రైజ్ సింగపూర్ రీజినల్ డైరెక్టర్(ఇండియా - సౌత్) డేనిస్ టాం తదితరులు పాల్గొన్నారు.



# మే 6 అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ సమ్మె

## 7వ తేదీ ఫస్ట్ షిఫ్ట్ డ్యూటీ నుంచి విధుల బహిష్కరణ
### నేటికీ జీతాలు రాలేదని ఉద్యోగుల ఆవేదన
### విధిలేని పరిస్థితులలో సమ్మెకు వెళ్తున్నామన్న జేఏసీ

**మహా :** దీర్ఘకాలంగా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు ఎట్టకేలకు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు. మే ఆరవ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు దిగాలని ఆర్టీసీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్, లేబర్ కమిషనర్కు ఆర్టీసీ జేఏసీ నేతలు సోమవారం సమ్మె నోటీసులు ఇచ్చారు. మే 7వ తేదీ మొదటి డ్యూటీ నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు నేటి వరకు జీతాలు పడలేదని నోటీసుల్లో పేర్కొన్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికులకు సంస్థ చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించడం, సంస్థకు కొత్త బస్సులను ప్రభుత్వమే సమకూర్చడం, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు దాదాపు 26 డిమాండ్లను ఉద్యోగ సంఘాల జేఏసీ నోటీసులో పేర్కొంది. ఉద్యోగులకు ఇంత వరకు డీఏలను కూడా పూర్తి స్థాయిలో ప్రబుత్వం మంజూరు చేయలేదని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారం కోసం గత కొంత కాలంగా యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ ఏ మాత్రం పురోగతి లేకపోవడంతో విధిలేని పరిస్థితులలో సమ్మెకు వెళ్ళాలని నిర్ణయించామని జేఏసీ స్పష్టం చేసింది.

# ఈ బంధం దృఢమైనది

## సోలార్ పవర్, రీజినల్ రింగ్ రోడ్, మూసీ పునర్జీవం, విద్య మా ప్రాధాన్యతులు
### సింగపూర్ ప్రతినిధి బృందంతో డిప్యూటీ సీఎం భట్టి
### తెలంగాణతో ఆర్థిక సంబంధాల బలోపేతంపై ఆసక్తి
### సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్

(మొదటి పేజీ తరువాయి)

గ్రీన్ ఎనర్జీ , రీజినల్ రింగ్ రోడ్డు, మూసి పునర్జీవనం, విద్య తమ ప్రభుత్వ ప్రాధాన్యత రంగాలని ఈ రంగాల్లో సింగపూర్ సంస్థలతో కలిసి పని చేసే అంశంపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. కొత్త గ్రీన్ పవర్ పాలసీలో భాగంగా సోలార్, హైడ్రో, పంపుడ్ స్టోరేజీ విభాగాలపై దృష్టి పెట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు సింగపూర్ ప్రతినిధి బృందానికి వివరించారు. మొదటి దశలో 600 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు విడుదల చేశామని, ప్రతి పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నామని, ఇది రాష్ట్ర ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్టు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఒక నగర రాజ్యం, అత్యధికంగా పట్టణాలు ఉన్నాయని పట్టణ అభివృద్ధి పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టినట్టు తెలిపారు. సమావేశంలో సింగపూర్ పొలిటికల్ కాన్సుల్ వైష్ణవి వాసుదేవన్, సింగపూర్ హై కమిషన్ ప్రధమ ఆర్థిక సెక్రటరీ, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ తిని బతికేస్తున్నాం

## ఆహార కల్తీలో టాప్‌లో తెలుగు రాష్ట్రాలు

### రెండవ స్థానంలో తెలంగాణ, 4వ స్థానంలో ఏపీ
### సగటున 22 శాతం కల్తీ ఆహార పదార్థాలే



**మహా :** ఒకవైపు వాతావరణంలో కాలుష్యం పెరిగిపోయి ప్రజారోగ్యం గాలిలో దీపంగా మారింది. మరోవైపు కట్టడి లేని కల్తీ ఆహారంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు తప్పదని హెచ్చరికలు వస్తున్నాయి. ఆహార పదార్థాల తయారీలో, వాటిని నిల్వ చేయడంలో, ప్యాకింగ్‌లో, తయారీ కోసం నూనెలు, కారం పొడి, పిండి పదార్థాలు, పసుపు, మసాలా లాంటివి అన్ని ప్రస్తుతం కల్తీ అవుతూనే ఉన్నాయి. మహానగరాలు, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఆహార పదార్థాల విక్రయాలు భారీగా పెరిగిపోయాయి. ఎక్కడపడితే అక్కడ బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు రాత్రి, పగలు అనే తేడా లేకుండా అందుబాటులో ఉంటున్నాయి. ఇక సిటీల్లో అయితే ఇంట్లో వంటలకు స్వస్తి పలికి ఉదయం టిఫిన్లు మొదలు రాత్రి భోజనం వరకు అన్నీ బయటే కానిచ్చేసే వారు ఎందరో ఉన్నారు. మందుబాబులకు అయితే చెప్పాల్సిన పనే లేదు. ఏం తింటున్నాం.. ఏం తాగుతున్నాం అనే విషయం కూడా వారికి ఆలోచనకు వచ్చే పరిస్థితులు లేవు. ఇదే అదనుగా చేసుకొని నాణ్యతను పట్టించు కోకుండా అడ్డగోలుగా ఆహార పదార్థాలను కల్తీ చేసేస్తున్నారు.

### తమిళనాడు నెంబర్ వన్..
### తెలంగాణ నెంబర్ 2

ఈ క్రమంలోనే 2021-24 మధ్య దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలు, అందులో కల్తీగా తేలిన నమూనాల వివరాలను కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్రాల వారీగా ఇటీవల పార్లమెంటుకు నివేదించింది. ఆహార భద్రత అధికారులు గత నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 22 శాతం కల్తీవే ఉండటం అందరికీ షాక్ ఇస్తుంది. ఈ లెక్కల ప్రకారం ఆహార కల్తీలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు టాప్ లో నిలిచాయి. ఆహార కల్తీలో దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు 20 శాతం సగటుతో దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉంది. 14 శాతంతో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణలో సేకరించి పరీక్షించిన ప్రతి 100 నమూనాల్లో 14 కల్తీ ఆహారంగా తేలుతున్నాయి. ఇక ఆ తర్వాత 13.11 శాతంతో కేరళ, 9 శాతంతో ఆంధ్రప్రదేశ్, 6.30 శాతంతో కర్ణాటక తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ లెక్కలు చూసి ప్రజలు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిబంధనలకు పాతరేస్తూ నామమాత్రపు తనిఖీలు చేయకుండా కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. లైసెన్సుల జారీ విషయంలోనే మరింతగా నియమాలు అమలు చేయాలని అంటున్నారు.

# వక్ఫ్ సవరణ చట్టంపై అత్యవసర విచారణ

## పిటిషన్ల లిస్టింగ్‌కు సీజేఐ ధర్మాసనం అంగీకారం

**మహా:** పార్లమెంటు ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఇందుకుగానూ ఆయా పిటిషన్ల లిస్టింగ్‌కు అనుమతి ఇచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈమేరకు సోమవారం నిర్ణయం తీసుకుంది. జమియత్ ఉలమాయె హింద్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఇతర ముస్లిం పక్షాల తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, న్యాయవాది నిజాం పాషా దాఖలు చేసిన పిటిషన్లను పరిశీలించిన సుప్రీంకోర్టు బెంచ్, వాటి అత్యవసర విచారణకు అంగీకారం తెలిపింది. "కేసులను అత్యవసర విచారణకు చేపట్టాలని మౌఖికంగా ధర్మాసనాన్ని కోరితే చెల్లదు. సమగ్ర వివరాలతో లేఖ లేదా మెయిల్స్‌ను న్యాయవాదులు పంపాల్సి ఉంటుంది" అని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. దీనికి న్యాయవాది కపిల్ సిబల్ బదులిస్తూ "మేం ఆ ప్రక్రియను పూర్తి చేశాం" అని చెప్పారు. "అయితే నేను ఆ లేఖలను మధ్యాహ్నం చూసి, తగిన నిర్ణయం తీసుకుంటాను. వాటిని లిస్ట్ చేయిస్తాం" అని సీజేఐ వెల్లడించారు.



### పిటిషన్లు వేసింది వీరే!

వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన వారిలో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావెద్, ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ తదితరులు ఉన్నారు. ఒవైసీ తరఫున అడ్వకేట్ లాజఫీర్ అహ్మద్ పిటిషన్‌ను దాఖలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టం 2025ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తేకుండా ఆపాలంటూ జమియత్ ఉలమాయె హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదనీ మధ్యంతర పిటిషన్ కూడా వేశారు. సున్నీ మతపెద్దల సంస్థ సమస్త కేరళ జమియతుల్ ఉలెమా కూడా పిటిషన్ వేసింది. ఈ సంస్థ తరఫున పిటిషన్‌ను అడ్వకేట్ జుల్ఫికార్ అలీ పీఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. అసోసియేషన్ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ అనే స్వచ్ఛంద సంస్థ కూడా పిటిషన్ వేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 21, 25, 26, 29, 30, 300ఎలకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం 2025 ఉందని పిటిషన్లలో వాదించారు.

# కేసుల ఎత్తివేత

## హెచ్ సీయూ భూములపై పోరాటం


### విద్యార్థులపై కేసులు ఉపసంహరించండి
### పోలీసులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

**మహా :** హెచ్ సీయూ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో హెచ్ సీయూ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్ తో సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జరిపిన చర్చల అనంతరం డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. జ్యూడిషియల్ రిమాండ్ లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల ఉపసంహరణ క్రమంలో ఎటువంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.

# యువతిపై కీచకుల అఘాయిత్యం

### చాకచక్యంతో తప్పించుకుని పోలీసు స్టేషన్ కు చేరిన యువతి
### మేడ్చల్ రైల్వే స్టేషన్ వద్ద ఘటన

**మహా :** ఇటీవల ఎంఎంటీఎస్ రైలులో యువతిపై అత్యాచార యత్నం ఘటన మరువక ముందే మేడ్చల్ రైల్వేస్టేషన్ సమీపంలో అలాంటి ఘటనే చోటు చేసుకుంది. ఓ యువతిపై దుండగులు అత్యాచారానికి యత్నించారు. అయితే యువతి ప్రతిఘటించడంతో అక్కడ నుంచి వారు పరుగులు తీశారు. మేడ్చల్ రైల్వే స్టేషన్ పరిధిలో ఓ యువతి ఆదివారం రాత్రి ఒంటరిగా వెళ్తుండుగా ఆమెను అడ్డుకున్నారు కీచకులు. యువతిపై అఘాయిత్యానికి పాల్పడేందుకు ప్రయత్నించారు. అయితే యువతి కూడా ఎక్కడా తగ్గకుండా వారితో ధైర్యంగా పోరాడింది. కామాంధుల నుంచి తనను తాను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. ఒక్కసారిగా దుండగులు మీదకు రావడంతో వారిని అడ్డుకునేందుకు అక్కడే ఉన్న రాళ్లతో దాడి చేసి తప్పించునేందుకు ప్రయత్నించింది. అయినప్పటికీ వారు వెంటపడటంతో తీవ్రస్థాయిలో ప్రతిఘటించింది యువతి. చివరకు ఆ దుండగుల భారి నుంచి ఎలాగోలా తప్పించుకుని వెంటనే మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. పీఎస్‌లో దుండుగులు ఏ విధంగా ఇబ్బందులకు గురిచేశారు.. తాను ఎలా తప్పించుకుందో పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటన మేడ్చల్ రైల్వేస్టేషన్ పరిధిలో జరగడంతో ఈ కేసును రైల్వే పోలీసులకు ట్రాన్స్‌ఫర్ చేశారు మేడ్చల్ పోలీసులు.



ఈ మధ్య కాలంలో రైల్వేస్టేషన్ సమీప ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకుంటున్నాయంటూ పలు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది గంజాయి తీసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గంజాయి మత్తులో ప్రయాణికుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి నేపథ్యంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో భద్రత పెంచాలంటూ పలు డిమాండ్‌లు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడు తాజాగా మేడ్చల్‌లో జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి జీఆర్పీ పోలీసులకు బదిలీ చేయగా.. వారు కేసును విచారణ జరుపుతున్నారు. కీచకులతో ప్రతిఘటిస్తున్న సమయంలో యువతికి కూడా కొంత మేర గాయాలు అవడంతో ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



# ప్రతిపక్షాల కుట్రలో పావుగా మారిన విద్యార్థులు

- హెచ్ సీయూ భూములపై హక్కు లేదనడం సరికాదు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**మహా :** కంచ గచ్చిబౌలి భూములపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదని విద్యార్థులు అనడం సరికాదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యార్థి , ఉపాధ్యాయులను బీజేపీ, బీఆర్ఎస్ లు రెచ్చగొట్టాయని ఆయన ఆరోపించారు. భూముల వ్యవహారం పై బీజేపీ, బిఆర్ఎస్ లు కలసి కుట్రకు తెరలేపాయని మండిపడ్డారు. సన్న బియ్యం పంపిణీ ,రాజీవ్ యువ వికాసం పై చర్చ జరగకుండా బీజేపీ, బీఆర్ఎస్ లు ఓ పెద్ద కుట్రకు తెరలేపారన్న అనుమానం కలుగుతుందన్నారు. తమను రాష్ట్ర నేతలు పట్టించుకోవడం లేదని ఫేక్ వీడియోలతో రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ కు ట్యాగ్ చేస్తున్నారని, ఇదంతా తప్పని అన్నారు. మొత్తంగా ప్రభుత్వాన్ని సైకలాజికల్ గా డిస్టబ్ చేయాలనేది బీజేపీ, బిఆర్ఎస్ కుట్ర పన్నాయన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అనని మాటలను అన్నట్లు గా కొన్ని పేపర్లు రాశాయని, ఊహాగానాలను వాస్తవవార్తల రూపంలో రాయడం సరైంది కాదన్నారు. కేంద్రంలో బీజేపీ ,రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కంచ గచ్చిబౌలి భూములను ఐఎంజీ కి లీజు కు ఇచ్చారని, బిల్లీ రావుతో ఒప్పందం లేకపోతే గత పదేళ్లుగా 400 ఎకరాల భూమిపై బిఆర్ఎస్ ఎందుకు కొట్లాడలేదని నిలదీశారు. హెచ్ సీయూ స్టూడెంట్స్ కూ ఈ సమస్య పై అవగాహన లేదన్నారు. దీంతో ప్రతిపక్షాల కుట్రలో విద్యార్థులు పావుగా మారారన్నారు. కంచ గచ్చిబౌలి వివాదంపై సీఎం లేదంటే మంత్రి శ్రీధర్ బాబు ఎవైనా కామెంట్ చేస్తేనే అది ప్రభుత్వ నిర్ణయం అవుతుందన్నారు. యూనివర్సిటీ తరలింపు అనేది ఊహాగానమేనని స్పష్టం చేశారు. ప్రైవేటు కంపెనీకి కేటాయించిన భూమిని తిరిగి తీసుకుని అభివృద్ధి చేస్తామంటే ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు.

# రాజీవ్ యువ వికాసానికి 9 లక్షల దరఖాస్తులు

## 20 లక్షల దరఖాస్తులు వస్తాయని అధికారుల అంచనా

### ఆఫ్ లైన్ లో సైతం తీసుకుంటున్న ఆఫీసర్లు




**మహా :** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రాజీవ్ యువ వికాసం స్కీమ్ కు అనూహ్య స్పందన వస్తోంది. వాస్తవానికి ఈనెల 4తో గడువు ముగియగా 14 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించారు. ఆదివారం వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖలకు కలిపి మొత్తం 9 లక్షల అప్లికేషన్లు వచ్చాయి. ఈనెల 14 వరకు మొత్తం 20 లక్షల అప్లికేషన్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ పథకానికి అప్లై చేసేందుకు మీ సేవ కేంద్రాలు, ఇంటర్ నెట్ సెంటర్లకు లబ్ధిదారులు పోటెత్తుతున్నారు. కుల, ఆదాయ దృవీకరణ పత్రాల కోసం లబ్ధిదారులు భారీగా అప్లై చేస్తుకుంటున్నారు. వీటి కోసం కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, 2016 తరువాత తీసుకున్న వాటిని అంగీకరిస్తున్నామని అధికారులు ప్రకటించారు. రేషన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉంటే సరిపోతుందని, ఇన్ కం అవసరం లేదని స్పష్టం చేశారు. ఇక ఈ స్కీమ్ గురించి సమాచారం, అర్హత, ఇతర సమగ్ర వివరాల కోసం మండల, మున్సిపాలిటీల్లో ఉన్న ప్రజాపాలన సేవా కేంద్రాల్లో హెల్ప్ లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ అప్లికేషన్లను మే 31 వరకు మండల, జిల్లా స్థాయిలో స్క్రీనింగ్ చేసి లబ్ధిదారులను మండల కేంద్రాల్లో ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ల ఆమోదానికి పంపనున్నారు. జిల్లా కలెక్టర్లు ఆమోదించిన తరువాత జూన్ 2న ప్రభుత్వం రుణాలు మంజూరు చేయనుంది.

**బ్యాంక్ లెటర్ తప్పనిసరి**

యువ వికాసం పథకం కోసం అప్లై చేసుకుంటున్న లబ్ధిదారులు అప్లికేషన్ లో తమకు ఉన్న బ్యాంక్ అకౌంట్ ఖాతా నంబర్, బ్రాంచ్ వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ స్కీమ్ కు బ్యాంకు అధికారులు కన్సెంట్ లెటర్ (లోన్ ఇచ్చేందుకు ఏ అభ్యంతరం లేదంటూఇ ఇచ్చే ఎన్వోసీ లాంటిది ) ఇస్తేనే అర్హులుగా పరిగణిస్తారు.

# కొందరు అధికారులే నిజమైన అంధులు

### తెలంగాణ దివ్యాంగుల శాఖ అధికారుల తీరుపై
### హైకోర్టు జడ్జి జస్టిస్ నగేష్ భీమపాక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

**మహా :** తెలంగాణ దివ్యాంగుల శాఖ అధికారుల తీరుపై హైకోర్టు జడ్జి జస్టిస్ నగేష్ భీమపాక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంధులను కోర్టుల చుట్టూ తిప్పించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కొందరు అధికారులే నిజమైన అంధులని ఆయన వ్యాఖ్యానించారు. అన్యాయంగా ఉద్యోగాల నుంచి తొలగించారని కొందరు అంధ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వేరువేరు కారణాలతో తొలగించడంపై 8 ఏళ్లుగా వారు న్యాయపోరాటం చేస్తున్నారు. వారంతా కోర్టుల చుట్టూ తిరగడానికి కారణమైన అధికారులపై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారుల తీరుతో కొందరి అంధుల ఉద్యోగ జీవితం మసకబారుతోందని ధర్మాసనం పేర్కొంది.

# రైతులు పండించిన ప్రతి గింజా కొంటాం

## పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినీ రెడ్డి

**జనగామ, మహా:** రైతులు ధాన్యంను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినీ రెడ్డి సూచించారు. పాలకుర్తి మండలంలోని, లక్ష్మీనారాయణపురం గ్రామం ఐకేపీ, ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినీ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ సన్నరకం వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, రైతులకు ఏ ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతులు కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రతి రైతుకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి అహ్మదాబాద్ లో ఎఐసిసి కీలక సమావేశాలు

## హాజరుకానున్న సీఎం రేవంత్ రెడ్డి, భట్టి, మహేష్ గౌడ్

**మహా:** కాంగ్రెస్ నేతల చూపు అహ్మదాబాద్ పై పడింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 8,9 తేదీల్లో ఏఐసీసీ కీలక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశంపై తెలంగాణ నేతలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మొదటి రోజు సీడబ్ల్యూసీ, రెండో రోజు ఏఐసీసీ మీటింగ్ నిర్వహించనున్నారు. ఇందులో కీలకమైన అంశాలపై చర్చ జరగనున్నది. సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటుంటున్న సమస్యల పరిష్కారానికి, దేశానికి పటిష్ఠమైన ప్రత్నామ్నాయ విజన్‌ను ఆవిష్కరించేందుకు ఈ సెషన్ ఓ వేదిక కానుందని ఏఐసీసీ ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. దేశంలో బీజేపీ అనుసరిస్తోన్న విధానాలతో ఎదురవుతున్న సవాళ్లు, రాజ్యాంగ విలువలపై జరుగుతున్న దాడి, భవిష్యత్ కార్యాచరణను సైతం ఏఐసీసీ సదస్సులో కీలకంగా డిస్కస్ చేయనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. 8వ తేదీన జరిగే సీడబ్ల్యూసీ సెషన్‌కు, 9న జరిగే ఏఐసీసీ డెలిగేట్స్ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించనున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్మన్ సోనియాగాంధీ, అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, నేషనల్ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నేతలు, ఏఐసీసీ డెలిగేట్స్ అటెండ్ కానున్నారు.



### 1700 మంది ప్రతినిధులు

ఈ సమావేశాలకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 1,700 మంది ప్రతినిధులు అటెండ్ అవుతారని ఏఐసీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన 44 మందికి ఏఐసీసీ నుంచి ఆహ్వానం అందింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీడబ్ల్యూసీ మెంబర్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. కాగా ఈ సమావేశం అనంతరం తెలంగాణలో ప్రభుత్వ పటిష్టానికి, పదవుల భర్తీకి చర్యలుంటాయన్న ఆశాభావం నేతల్లో వ్యక్తమవుతోంది.

# అభాగ్యుల అభ్యున్నతిలో తెలంగాణ రోల్ మోడల్ - మంత్రి సీతక్క

## సామాజిక న్యాయ సాధన దిశలోనే ప్రతి పైసా ఖర్చు చేస్తున్నాం

### డెహ్రాడూన్ చింతన్ శివిర్ లో ప్రసంగం.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించిన మంత్రి



**మహా:** అభాగ్యుల అభ్యున్నతిలో తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు మంత్రి సీతక్క. సామాజిక న్యాయ సాధన దిశలోనే ప్రజా ప్రభుత్వం ప్రతి పైసా ఖర్చు చేస్తోందన్నారు. సామాజిక న్యాయం, సాధికారత పై కేంద్ర సామాజిక న్యాయ మంత్రి డా. వీరేంద్ర కుమార్ అధ్యక్షతన డెహ్రాడూన్ లో జరిగిన చింతన్ శివిర్ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో వయవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషి, అమలవుతున్న పథకాలను వివరించారు. ఆయా వర్గాల సంక్షేమం కోసం కేంద్ర సహకారాన్నిఅభ్యర్ధించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం చేస్తున్న కృషిని మంత్రి సీతక్క గుర్తు చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాల్లో అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడమే సామాజిక న్యాయమని... ఆ దిశలో రెండు కీలక బిల్లులకు తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీకవంగా ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. బీసీ వర్గాలకు జనాభా ప్రాతిపదికన విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లను 42 శాతం వరకు పెంచడంతో పాటు, 30 ఏండ్లుగా పెండింగ్ లో ఉన్న ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించినట్లు వెల్లడించారు. ఈ రెండు బిల్లులు సామాజిక న్యాయాన్ని అమలు చేసే దిశలో గొప్ప మైలు రాల్లుగా నిలుస్తాయన్నారు మంత్రి సీతక్క. సంపన్నులు తినే సన్న బియ్యాన్ని ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా కోట్ల మంది ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో సన్న బియ్యం పేదలకు అందించే ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. దీంతో పాటు అణగారిన వర్గాలు, పేదల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. ఇలా ఎన్నో పథకాలతో పేదలు, అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతికే విధంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తూ సామాజిక న్యాయానికి పర్యాయ పదంగా నిలుస్తోందన్నారు. "దళితులు, ఆదివాసీలు, మహిళలు చారిత్రాత్మకంగా అణచివేయబడ్డారు. వివక్షకు వ్యతిరేకంగా చాలా కాలంగా పోరాడుతున్నారు. సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, ట్రాన్స్ జెండర్లు ఇప్పటికీ నిర్లక్షానికి గురవుతున్నారు. భారత రాజ్యాంగం ఈ అన్యాయాలను గుర్తించి న్యాయమైన, సమ్మిళిత సమాజం కోసం కృషి చేస్తోంది. అందుకే నిజమైన సామాజిక న్యాయం వైపు సమిష్టిగా కదలడం మన విధి" అన్నారు మంత్రి సీతక్క. సమానత్వ సాధన దిశలో తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఒక్కరి సంరక్షణ, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందన్నారు సీతక్క. దాతృత్వంలో కాకుండా సామాజిక న్యాయం ఎత్తి పట్టే విధంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ గారు చెప్పినట్లుగా, అభివృద్ధి అంటే కర్మాగారాలు, ఆనకట్టలు లేదా రోడ్ల నిర్మాణమే కాదు. అభివృద్ధి అంటే ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం, నైతిక విలువలను పెంపొందిచడమన్నారు సీతక్క. అభాగ్యుల అభ్యున్నతి కోసం తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. దివ్యాంగులు ఆత్మ గౌరవంతో బతికేలా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. రూ. 300 కోట్లతో రాజీవ్ యువ వికాసం ద్వారా 25 వేల మందికి స్వయం ఉపాధి కల్పిస్తమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పాటు ప్రతి రంగంలో దివ్యాంగులకు జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. తెలంగాణలో 32.69 లక్షల మంది వయోవృద్ధుల నెలవారి పెన్షన్ కోసం గత ఏడాది రూ. 3056.94కోట్లను వెచ్చించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పది లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందచేస్తున్నామన్నారు. పిల్లల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులకు న్యాయ సహాయం అంద చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్ జెండర్ల సంక్షేమం కోసం ప్రతి జిల్లాలో మైత్రి క్లినిక్ ల ఏర్పాటుతో పాటు 44 మందిని ట్రాఫిక్ అసిస్టెంట్ గా నియమించినట్లు వెల్లడించారు. 2 లక్షల సబ్సిడీతో 72 మంది కి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. సామాజిక న్యాయ సాధన దిశలోనే తెలంగాణ ప్రభుత్వం ప్రతి పైసా ఖర్చు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సాధికార శాఖ జాయింట్ డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు

# ఏం జరుగుతుందో ఆ దేవుడికే తెలియాలి.. ట్రంప్ టారిఫ్ లపై శశిథరూర్

**అహ్మదాబాద్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ సహా పలు దేశాలపై సుంకాలు విధించినప్పటి నుంచి ప్రపంచం చాలా ఇబ్బంది పడుతోందని కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ అన్నారు. అమెరికాతో ద్వైపాక్షిక చర్చల ద్వారా భారత్‌కు ఉపశమనం లభిస్తుందని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 89 తేదీల్లో జరగనున్న ఏఐసీసీ సమావేశాల్లో పాల్గొనేందుకు అహ్మదాబాద్‌కి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల పాటు జరగనున్న కాంగ్రెస్ కీలక సమావేశాల్లో దేశంలోని తాజా పరిస్థితులు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులు ట్రంప్ విధించిన టారిఫ్‌లపై ప్రశ్నించగా.. ''ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లు అన్ని దేశాలకూ ప్రతికూల వార్తే. ట్రంప్ టారిఫ్‌ల వెనుక లాజిక్ ఎవరికీ అర్థం కావడంలేదు. ఈ ప్రభావం అన్ని దేశాలపైనా ఉంది. భారత్ కూడా వీటిని భరించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని ఎవరూ ఊహించి ఉండరు. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఆ భగవంతుడికే తెలియాలి. ట్రంప్ ఏప్రిల్ 2న టారిఫ్‌లు ప్రకటించగా.. ఈ ఐదు రోజుల్లో ప్రపంచం చాలా ఇబ్బందికి గురైంది'' అని వ్యాఖ్యానించారు.



**Z కేటగిరి**

# కట్టిన ఇల్లు,పెట్టిన పొయ్యి
# ఏమాయె సారూ!


'కట్టిన ఇల్లు,పెట్టిన పొయ్యి' అని బిఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్,వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే మాట్లాడుతున్నారు.అంటే తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దామని,అన్ని సమస్యలు పరిష్కరించేశామన్నది ఆ మాట తాత్పర్యం. తాము అలాంటి పరిస్థితిలో రాష్ట్రాన్ని అప్పజెప్పగా దాన్ని రేవంత్ రెడ్డి సర్వనాశనం చేస్తున్నట్టు తండ్రీ,కొడుకు,మేనల్లుడూ ఆరోపిస్తున్నారు. కానీ వాస్తవం వేరు. కేసీఆర్ చేసిన అప్పులకు ప్రతినెలా 6,500 కోట్లు వడ్డీ కట్టవలసి రావడం కన్నా దుర్భర పరిస్థితులు ఏముంటాయి?ఈ అప్పుల గురించి,వడ్డీల గురించి,అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థ గురించి బిఆర్ఎస్ నాయకులు మాట్లాడరు.తాము ఆ అప్పులతో సంపద సృష్టించినట్టు దబాయింపు.

''కొత్తగా నడిపించేది ఏం లేదు. మొద్దులు మోసేది లేదు.కట్టెలు కొట్టేది లేదు.కొత్తగా గడ్డపారలు పట్టి తవ్వేదిలేదు. ఉన్నది ఉన్నట్టు నడిపించలేని అసమర్థత ఏంది? అశక్తత ఏంది? కట్టిన ఇల్లు,పెట్టిన పొయ్యి కదా.దానిని నడిపించే తెలివిలేకపోతే ఎట్లా''? అని కేసీఆర్ 2024 ఏప్రిల్ లో అన్నారు.మాటల గారడీకి ఆయన పర్యాయపదం అనే సంగతి చెప్పవలసిన పనేం లేదు. అందుకే తెలివిగా 'కట్టిన ఇల్లు,పెట్టిన పొయ్యి' ని సమర్థంగా నడపలేకపోతున్నట్టుగా రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నారు. రాజకీయంగా నానాటికి బలపడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బలహీన పరచడమెలా?అనే అంశంపై బిఆర్ఎస్ అన్ని కోణాల్లో 'పరిశోధన' జరుపుతోంది.రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయడమే ఇందుకు సరయిన మార్గంగా ఆ పార్టీ నిర్ధారణకు వచ్చినట్టు తెలియవచ్చింది. ఇందులో భాగంగానే 'వివాదాస్పదం కాని', ప్రభుత్వ భూములు అయిన కంచ గచ్చిబౌలి భూములను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములుగా ప్రచారం చేసింది. ఆ 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అభివృద్ధి కార్యకలాపాలకు వినియోగించుకునే హక్కు ,అధికారం ప్రభుత్వానికి ఉన్నాయి.ఈ భూములను వేలం వేస్తామని,మౌలిక సదుపాయాల కల్పనకు,పరిశ్రమల స్థాపనకు,ప్రజోపయోగ కార్యక్రమాలకు ఉపయోగిస్తామని ఈ భూముల గురించి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించడం ఆయన 'భోళా తనానికి ' నిదర్శనం.ఆ క్షణమే ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ లో ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారని తెలియవచ్చింది.

'తెలంగాణలో అస్థిర పరిస్థితులున్నాయి.శాంతి భద్రతలు లేవు.పెట్టుబడులకు పరిస్థితులు అనుకూలంగా లేవు' అని ప్రజల్లో,పారిశ్రామికవేత్తలు,పెట్టుబడిదారులు,వ్యాపారవర్గాల్లో ఒక సందేశాన్ని బలంగా తీసుకువెళ్లడం ఆ యాక్షన్ ప్లాను సారాంశంగా అనుమానాలు వ్యక్తమవుతున్నవి.యాక్షన్ ప్లాను అమలుకుగాను తమ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ లన్నింటినీ అప్రమత్తం చేశారు.వాటిలో పనిచేస్తున్న 'సుపారీ' వ్యక్తులందరినీ సిద్ధం చేశారు.తమ చతురంగ బలగాలను మోహరింపజేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారు భయపడే రీతిలో 'క్యాంపెయిన్' జరుగుతోంది. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే పెట్టుబడులు తప్పనిసరి. పెట్టుబడులు వస్తే పరిశ్రమల స్థాపన జరుగుతుంది. పరిశ్రమలు వస్తే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. పరిశ్రమల ఏర్పాటుకు కావలసిన భూసేకరణకు అడుగడుగునా బిఆర్ఎస్ అడ్డుకుంటోంది. అలజడి సృష్టిస్తోంది.హైదరాబాద్ లో అశాంతి వాతావరణం ఉన్నట్టు వ్యాపార,పారిశ్రామిక వర్గాలు భావిస్తే ఇక పెట్టుబడులు పెట్టడానికి వారెలా ముందుకొస్తారు? ఈ విషయాన్ని కాచివడబోసిన కేసీఆర్,కేటీఆర్ ఒక పథకం ప్రకారమే పెట్టుబడులు రాకుండా 'కృత్రిమ అశాంతి' ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నారని పరిశీలకులు అంటున్నారు. సెంట్రల్ యూనివర్సిటీ,కంచె గచ్చిబౌలి భూముల సంగతి పక్కన బెడితే రెండు విషయాలు ఖచ్చితంగా మాట్లాడి తీరాలి.

1. ప్రజల్లో వచ్చిన నిరసనల వలన నిర్మల్ జిల్లాలో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు అనుమతులను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే.హైదరాబాద్ నాగపూర్ జాతీయరహదారిపై ఈ పరిశ్రమకు వ్యతిరేకంగా ఎంత పెద్దఎత్తున పోరాటం నడిచిందో చూసాం.ఈ ఆందోళనల వెనుక ఒక 'రాజకీయ'కుట్ర ఉందని,కనీసం పది,ఇరవై మంది చనిపోయినా ఉద్యమాన్ని కొనసాగించాలన్న లక్ష్యంతో ఆ రాజకీయపార్టీ చేసిన ప్రయత్నాలను తాము భగ్నం చేసినట్టు సీనియర్ ఐపీఎస్ అధికారి నాకు చెప్పారు. ఆర్డీవోపై దాడికి తెగబడిన సంఘటన కూడా జరిగింది. ఆ అధికారి ఇంకా చాలా విషయాలు చెప్పినా వాటిని రాయదలచుకోలేదు. పోలీసు కాల్పులు జరిపేదాకా ఆందోళనను విరమించకూడదని సామాన్య యువకులను 'హిప్నటైజ్'చేశారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

2. లగచర్లలో భూసేకరణ కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభలకు హాజరయ్యేందుకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ సహా మరికొందరు ఉన్నతాధికారులను 'హత్య' చేయడానికి కుట్ర జరిగినట్లు గతంలో ఆరోపణలు వచ్చాయి.జిల్లా కలెక్టర్,ఇతర రెవెన్యూ అధికారుల బృందం ఆ గ్రామానికి చేరగానే 'మాటు వేసిన' అసాంఘిక శక్తులు వారిని పక్కదోవపట్టించి, తర్వాత రాళ్లు,ఇతర మారణాయుధాలతో దాడులకు తెగబడడం,అప్పటికప్పుడు యాదృచ్ఛికంగా జరిగిన ఘటనలు కావని పోలీసులు ఇప్పటికీ చెబుతుంటారు.సరే,ఆ హింసాత్మక ఘటనల వెనుక ఒక 'రాజకీయ పార్టీ' ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వచ్చాయి.ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకించడంతో భాగంగా జరిగిన నిరసన కార్యక్రమాలు అయినా ,లగచర్ల భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఘటనలు అయినా ఒక ప్రణాళికా బద్ధంగానే జరిగినట్టు సీనియర్ ఐపీఎస్ అధికారులు చెబుతున్నారు.కాక తాళీయంగా ప్రజాగ్రహంతో జరిగిన ఘటనలు కావని అంటున్నారు.



> లగచర్లలో భూసేకరణ కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభలకు హాజరయ్యేందుకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ సహా మరికొందరు ఉన్నతాధికారులను 'హత్య' చేయడానికి కుట్ర జరిగినట్లు గతంలో ఆరోపణలు వచ్చాయి.జిల్లా కలెక్టర్,ఇతర రెవెన్యూ అధికారుల బృందం ఆ గ్రామానికి చేరగానే 'మాటు వేసిన' అసాంఘిక శక్తులు వారిని పక్కదోవపట్టించి, తర్వాత రాళ్లు,ఇతర మారణాయుధాలతో దాడులకు తెగబడడం, అప్పటికప్పుడు యాదృచ్ఛికంగా జరిగిన ఘటనలు కావని పోలీసులు ఇప్పటికీ చెబుతుంటారు

> రుణమాఫీ,ఆరు గ్యారంటీల అమలు,మూసీ,ఫోర్త్ సిటీ,ఆర్ఆర్ఆర్,మెట్రో విస్తరణ,గురుకులాల్లో సమీకృత భవనాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పేదప్రజలందరికీ 'సన్నబియ్యం' పంపిణీ పథకం రేవంత్ ఖాతాలో చేరాయి.రేవంత్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 55 వేల పైచిలుకు ఉద్యోగాల భర్తీ చేయడం ఒక సంచలనం. దేశంలోనే మొదటి సారిగా 'ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ'ని కొత్తగూడెంలో ఏర్పాటు చేయడం రేవంత్ ఖ్యాతిని పెంచింది. కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు అతలాకుతలంగా,అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరిదిద్దడం కష్టతరంగా ఉన్నది.

ముఖ్యమంత్రి రేవంత్ ఇమేజ్ ను దెబ్బతీయడానికి,కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబకడానికి రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ పార్టీ తన సర్వశక్తులూ ఒడ్డుతున్నట్టు పలు సన్నివేశాలు కనిపిస్తున్నవి. పైకి మాత్రం అవి ప్రజల ఆందోళన కార్యక్రమాలుగానో, విద్యార్థుల ఆందోళన లాగానో మనకు కనిపిస్తున్నప్పటికీ ఆయా ఆందోళన కార్యక్రమాలకు 'తార్కిక ముగింపు' ఎలా ఇవ్వాలి అనే అంశాన్ని కొందరు 'సోకాల్డ్' మేధావులు,బిఆర్ఎస్ ప్రాయోజిత మనుషులు 'డిజైను'చేసి పార్టీ పెద్దల నుంచి ఆమోదం తీసుకొని కార్యక్షేత్రంలోకి వదులుతున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నవి. రుణమాఫీ,ఆరు గ్యారంటీల అమలు,మూసీ,ఫోర్త్ సిటీ,ఆర్ఆర్ఆర్,మెట్రో విస్తరణ,గురుకులాల్లో సమీకృత భవనాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పేదప్రజలందరికీ 'సన్నబియ్యం' పంపిణీ పథకం రేవంత్ ఖాతాలో చేరాయి.రేవంత్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపే 55 వేల పైచిలుకు ఉద్యోగాల భర్తీ చేయడం ఒక సంచలనం. దేశంలోనే మొదటి సారిగా 'ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ'ని కొత్తగూడెంలో ఏర్పాటు చేయడం రేవంత్ ఖ్యాతిని పెంచింది.కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు అతలాకుతలంగా,అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరిదిద్దడం కష్టతరంగా ఉన్నది.

> ప్రభుత్వ పాలన సాఫీగా సాగకపోవడానికి ఒకటి ఆర్థికపరమైన సవాళ్లు అయితే,రెండవది ప్రధానప్రతిపక్షం బిఆర్ఎస్ నిరంతరం రేవంత్ రెడ్డిని డిఫెన్సులో పడవేసేందుకు చేస్తున్న కుటిల ప్రయత్నాలు. ఈ నేపథ్యంలో రేవంత్ ముక్కుసూటిగా,దూకుడుగా వెళుతున్నందున కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పథకాలు,కార్యక్రమాలను అమలు చేయడంలో భాగంగా కొన్ని ఆటంకాలు ఎదురవడం సహజం. కానీ,వాటిని ముందస్తు ప్రణాళిక ప్రకారం అమలు చేయాలి. చేసే పని మంచిదే అయినా దానికి ప్రజాభిప్రాయాన్ని సానుకూలంగా కూడగట్టడం అత్యంత ప్రధానం.

తెలంగాణలో అధికారంలో కాంగ్రెస్ ఉందా? బిఆర్ఎస్ ఉందా? అనే అనుమానాలు వచ్చే విధంగా కేసీఆర్,కేటీఆర్ మీడియా కథనాలు వండి వార్చుతోంది.కేసీఆర్ ఫార్మ్ హౌజ్ నుంచి పరిపాలించాలనుకున్నా ప్రజలకు అభ్యంతరం లేదనే విధమైన సమర్థన సాగుతోంది. ''ఇక తెలంగాణ తరహా మరో ఉద్యమానికి కార్యాచరణకు కేసీఆర్ పదును పెడుతున్నారు''! అని కేటీఆర్ సోషల్ మీడియా చెబుతోంది. తెలంగాణ రాష్ట్ర సాకార ఉద్యమం వెనుక 6 దశాబ్దాలకు పైగా ప్రజల్లో ఒక సెంటిమెంటు ఉన్నది.భావోద్వేగాలున్నవి. ఆ ఎమోషన్స్ తో సకల వర్గాలు కనెక్టు అయ్యారు. అది గడచిన కాలం.ఇప్పుడు మళ్ళీ తెలంగాణ తరహా ఉద్యమానికి ప్రాతిపదిక ఏమిటి? 'కేసీఆర్ పాలన రావడం కోసమేనా'? కేసీఆర్ పాలన ఎవరు కోరుకుంటున్నారు? భూస్వాములు,సంపన్నులు,కమ్మ,వెలమ సామాజిక వర్గాలు,పదేండ్ల పాటు ప్రకృతి వనరులను కొల్లగొట్టిన వారు,ఏదో ఒక పథకం రూపంలో ప్రయోజనం పొందిన వర్గాలు, కాంక్షిస్తున్నారేమోనన్న అనుమానాలు కలుగుతున్నవి. హైదరాబాద్ నగరాన్ని,దాని చుట్టు పక్కల ప్రాంతాలను 'కబళించిన' వర్గాలకు,వ్యక్తులకు,మరీ ముఖ్యంగా కోస్తాఆంధ్ర నుంచి వలస వచ్చి స్థిరపడి 'ఆనకొండ'లా చుట్టు ముట్టిన వారికి కేసీఆర్ అంటే ప్రేమ! కేటీఆర్ అంటే మమకారం! తండ్రీ కొడుకులు పదేండ్లు రియల్ ఎస్టేట్,సినీ పరిశ్రమ,సంపన్న సెక్షన్లతో ఎట్లా చెట్టా పట్టాలు వేసుకొని ఆ వర్గాల పాలిట 'అక్షయ పాత్ర' గా మారారో చూసాం.బహుశా మరో తెలంగాణ ఉద్యమానికి ఆయా వర్గాలే ఇంధనం సమకూర్చవచ్చు!

ఇలాంటి నకిలీ,మకిలి ఉద్యమాలకు ప్రజల మద్దతు ఉండదని కేసీఆర్ గ్రహించలేకపోతున్నారు. రెండు మూడు అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లడం ద్వారా బ్రెయిన్ వాష్ చేయాలని మైండ్ గేమ్ ఆడడానికి బిఆర్ఎస్ నాయకత్వం నిర్ణయించుకున్నట్టు సులభంగా అర్థం చేసుకోవచ్చు. 1:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో విఫలమయ్యారు. 2.కేసీఆర్ మరలా అధికారంలోకి వస్తే తప్ప రాష్ట్ర పరిస్థితి గాడిలో పడదు.ఈ రెండు విషయాలను ప్రజల మనస్సులో బలంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతను తీసుకురావడానికి బిఆర్ఎస్ నాయకత్వం శతవిధాలా ప్రయత్నిస్తున్నది.ప్రజల్లో ప్రభుత్వం పట్ల 'కృత్రిమ వ్యతిరేకత'ను సృష్టించలేరు. ఎన్ని గజకర్ణ,గోకర్ణ,టక్కు టమార విద్యల్లో ఆరితేరిన కేసీఆర్ అయినా ఈ ప్రయోగంలో విఫలం కావడం తథ్యమని కాంగ్రెస్ నాయకులంటున్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ప్రజలు 'స్వర్ణయుగం' చూశారని,ఇప్పుడు నరకం చూస్తున్నట్టుగా బిఆర్ఎస్ నాయకుల ప్రచారం చేస్తున్నారు. దశాబ్దాలుగా చీకటిలో మగ్గిన తెలంగాణకు కేసీఆర్ ముందుచూపుతోనే 'కరెంటు వెలుగు' వచ్చిందనీ చెబుతున్నారు.ఆర్థికక్రమశిక్షణ పాటించకపోవడం,ఇబ్బడి ముబ్బడిగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం,రాచరికపు పోకడలు,మూర్ఖపు చర్యలు రాష్ట్రాన్ని కేసీఆర్ హయాంలో అప్పుల ఊబిలో నెట్టివేశాయి.''కాళేశ్వరం వంటి ప్రాజెక్టు వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ అని నేను ఆనాడే చెప్పాను. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు ఎవరూ చేయగలిగింది ఏమీ లేదు.తెలంగాణ ఆర్థికంగా కుంగిపోవడానికి పాలకుల స్వయంకృతాపరాధం''! అని లోక్ సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ ఒక ఇంటర్వ్యూలో అన్నారు. ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ నుంచి ఎదురవుతున్న విమర్శల 'విపత్తు' తో సీఎం రేవంత్ నిరంతరం పోరాడవలసి వస్తున్నది. బహుశా గతంలో ఏ ముఖ్యమంత్రికీ ఇలాంటి విపత్తు వచ్చి ఉండదు.

గత ముఖ్యమంత్రుల మాదిరిగానే తన మార్కు అభివృద్ధి కూడా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. అభివృద్ధిలో సొంత ముద్ర ఉండాలని రేవంత్ ఆలోచనలలో భాగంగానే మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు,ఫోర్త్ సిటీ,రీజినల్ రింగ్ రోడ్డు వంటి మూడు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపట్టారు.ఈ కార్యక్రమాలు హైదరాబాద్ నగరానికి కొత్త కళను తీసుకొస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.మూసీ ప్రాజెక్టుతో పర్యావరణ పరంగానే కాకుండా ఆర్థిక,ఉపాధి,ఉద్యోగాల పరంగా కొత్త అవకాశాలు తీసుకొచ్చేలా చేయాలన్న సంకల్పంతో రేవంత్ ఉన్నారు.ఫోర్త్ సిటీ ప్రభుత్వం చేపట్టిన మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు.40 వేల ఎకరాల పరిధిలో అద్భుతమైన సరికొత్త నగరాన్ని నిర్మించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు.ఇప్పటికే ఇక్కడ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని,జీనోమ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు.స్కిల్ యూనివర్సిటీని రూ.200 కోట్లతో నిర్మించడానికి 'మేఘా' సంస్థ ముందుకు రావడమే కాకుండా నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేసింది. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాలకు వేర్వేరుగా ఉన్న గురుకుల పాఠశాలలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ళను ఏర్పారు చేస్తున్నారు.'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' పేరిట ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున ప్రభుత్వం నిర్మించనుంది. ఆరు గ్యారంటీల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ,ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం,రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత గృహ విద్యుత్తు,వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు,బియ్యం సబ్సిడీ, ఉపకార వేతనాలు,డైట్ చార్జీల పెంపు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలన్నీ అనేక వ్యయ ప్రయాసలకోర్చి అమలు చేస్తోంది.నిధుల సర్దుబాటు సమస్య అత్యంత తీవ్రంగా ఉన్నా రుణమాఫీ పథకం కిందే రూ.20,616 కోట్లను రేవంత్ ప్రభుత్వం వెచ్చించింది.రైతు భరోసా దశలవారీగా అమలవుతోంది.

కేసీఆర్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఉద్యోగాల కల్పనపై సీఎం రేవంత్ దృష్టి సారించారు.నిరుద్యోగులను సంతృప్తి పరచడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో వెలువడిన కొన్ని నోటిఫికేషన్లకు సంబంధించిన ఉద్యోగాలతోపాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన నోటిఫికేషన్లతో మరికొన్ని ఉద్యోగాలను భర్తీ చేసింది.చాలాకాలంగా పెండింగులో ఉన్న 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు,22 వేల మంది ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలను పూర్తి చేసింది. ప్రభుత్వ పాలన సాఫీగా సాగకపోవడానికి ఒకటి ఆర్థికపరమైన సవాళ్లు అయితే,రెండవది ప్రధానప్రతిపక్షం బిఆర్ఎస్ నిరంతరం రేవంత్ రెడ్డిని డిఫెన్సులో పడవేసేందుకు చేస్తున్న కుటిల ప్రయత్నాలు.ఈ నేపథ్యంలో రేవంత్ ముక్కుసూటిగా,దూకుడుగా వెళుతున్నందున కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.పథకాలు,కార్యక్రమాలను అమలు చేయడంలో భాగంగా కొన్ని ఆటంకాలు ఎదురవడం సహజం. కానీ,వాటిని ముందస్తు ప్రణాళిక ప్రకారం అమలు చేయాలి.చేసే పని మంచిదే అయినా దానికి ప్రజాభిప్రాయాన్ని సానుకూలంగా కూడగట్టడం అత్యంత ప్రధానం.హైడ్రా,మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం మొదట సంకటం ఏర్పడింది.నదీ గర్భంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని,ఏళ్ల తరబడి ఉంటున్న నిర్వాసితులను ముందుగా ఒప్పించకుండా,వారికి భరోసా కల్పించకుండా ముందుకు వెళ్లడం వల్ల నిర్వాసితులు ,ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత ఎదురైంది.ఆ విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం నేరుగా ప్రజల్లోకి వెళ్లింది. నల్లగొండ జిల్లాలో రైతులతో భారీఎత్తున పాదయాత్ర నిర్వహించింది.పర్యావరణవేత్తలు కూడా మూసీకి మద్దతు పలికారు. మరోవైపు హైడ్రా విషయంలోనూ ప్రభుత్వం సరిదిద్దుకుంది.సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు దిద్దుబాటు చర్యలు చేపడుతుండడం ప్రజాస్వామిక లక్షణం.'నా మాటే శాసనం' అన్నది కేసీఆర్ హయాంలో జరిగిన పాలానాతీరు.

రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయాణంలో తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా పదవి చేబట్టడం ఒక ముఖ్యమైన మైలురాయి. నాయకత్వ సామర్థ్యాన్ని,అలాంటి నాయకత్వ ప్రతిభకు ప్రజామోదం లభించింది."రేవంత్ ఒక నిబద్ధత కలిగిన పోరాట యోధుడు. రెండు దశాబ్దాల క్రితం శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్స్ కోసం మా ఆందోళనలో ఆయన యువకుడిగా చురుకుగా పాల్గొన్నట్లు నాకు గుర్తుంది" అని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి అప్పట్లో కామెంటు చేశారు.కేసీఆర్ కంటే ఆయన మంచి ముఖ్యమంత్రి అవుతారని ప్రొఫెసర్ జి. హరగోపాల్ అప్పట్లో చెప్పారు.పీసీసీ అధ్యక్షునిగా ఒంటి చేత్తో పార్టీని,ప్రచార పర్వాన్ని నడపడానికి కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి భట్టి,ఉత్తమ్,శ్రీధర్ బాబు,కోమటి రెడ్డి వెంకటరెడ్డి,రాజగోపాలరెడ్డి,వివేక్,పొన్నం తదితరులంతా తమ వంతు కృషి చేశారు.కానీ సీఎం పదవి రేవంత్ కు వరించడమంటే ఆషామాషీ కాదు. రేవంత్ రెడ్డి తలపెడుతున్న పలు కార్యక్రమాలు ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచడంతోపాటు రాష్ట్ర ప్రగతిని పరుగులు పట్టించేవే. 72కిలోమీటర్ల మేరకు మెట్రో విస్తరణ పనులు,హైదరాబాద్ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకువెళ్లనున్నాయి.'కంచ గచ్చిబౌలి' భూములకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో జరిగిన వైఫల్యం,రేవంత్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టింది.సుప్రీంకోర్టు దాకా బిఆర్ఎస్ వెళ్లే అవకాశమున్నట్టు కానీ,పర్యావరణ పరిరక్షణ పేరిట విద్యార్థులను రెచ్చగొట్టి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి శాంతిభద్రతల సమస్యను సృష్టించే అవకాశాలున్నట్టు కానీ సీఎం రేవంత్ కానీ,ఆయన టీమ్ లోని సీనియర్ మంత్రులు కానీ ఎందుకు గ్రహించలేకపోయారన్నది మిస్టరీ.ఇదీ ఒకరకంగా రేవంత్ ప్రభుత్వానికి మంచిదే.ఇకపై ఏ కార్యక్రమం అమలుకు పూనుకున్నా,ముందుగా బిఆర్ఎస్ ఎటువంటి అడ్డంకులు సృష్టించే ఛాన్సు ఉందో అంచనా వేయవచ్చు. అలాగే మరింత అప్రమత్తంగా ఉండి ప్రత్యర్థుల ఎత్తుగడలను భగ్నం చేయవచ్చు. ప్రభుత్వం అత్యద్భుతంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకం 'కంచ గచ్చిబౌలి' గొడవల్లో ప్రచారానికి నోచుకోకుండా పోయింది. బిఆర్ఎస్ కోరుకుంటున్నదీ అదే.రేవంత్ కు ఎట్టి పరిస్థితిలో ప్రజల్లో సానుకూలత ఏర్పడకూడదన్నది కేసీఆర్ పార్టీ విధానం.లేని సమస్యను ఉన్నట్టుగా చిత్రీకరించడంలో,'ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలయింద'నో ప్రాపగాండా చేయడంలో ఆ పార్టీ దిట్ట.దీన్ని ప్రజల్లో 'మౌత్ టాక్' వచ్చేలా సోషల్ మీడియాలోని 'భజన బ్యాచ్' ఉధృతంగా చేయడానికి ఆర్థిక వనరులను విచ్చలవిడిగా ఖర్చు చేయడానికి వెనుకాడడం లేదని తెలియవచ్చింది.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

> తెలంగాణలో అధికారంలో కాంగ్రెస్ ఉందా? బిఆర్ఎస్ ఉందా? అనే అనుమానాలు వచ్చే విధంగా కేసీఆర్,కేటీఆర్ మీడియా కథనాలు వండి వార్చుతోంది. తెలంగాణ రాష్ట్ర సాకార ఉద్యమం వెనుక ఆరు దశాబ్దాలకు పైగా ప్రజల్లో ఒక సెంటిమెంటు ఉన్నది. భావోద్వేగాలున్నవి. ఆ ఎమోషన్స్ తో సకల వర్గాలు కనెక్టు అయ్యారు. అది గడచిన కాలం. ఇప్పుడు మళ్ళీ తెలంగాణ తరహా ఉద్యమానికి ప్రాతిపదిక ఏమిటి? 'కేసీఆర్ పాలన రావడం కోసమేనా'? కేసీఆర్ పాలన ఎవరు కోరుకుంటున్నారు? భూస్వాములు, సంపన్నులు,కమ్మ,వెలమ సామాజిక వర్గాలు,పదేండ్ల పాటు ప్రకృతి వనరులను కొల్లగొట్టిన వారు,ఏదో ఒక పథకం రూపంలో ప్రయోజనం పొందిన వర్గాలు, కాంక్షిస్తున్నారేమోనన్న అనుమానాలు కలుగుతున్నవి.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



**హనుమకొండ, మహా:** హనుమకొండ జిల్లా పరిధిలోని ఆయా మండలాలలో ఎంపిక చేసిన గ్రామాలలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు, 2బీహెచ్ కే ఇళ్ల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం, బేస్మెంట్ దశకు ఎన్ని వచ్చాయి, ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు కలెక్టరుకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కావాల్సిన ఇసుక కూపన్లు అధికారులు అందజేయాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను వారంలో మూడు రోజులు అధికారులు పర్యవేక్షించాని అన్నారు. బేస్మెంట్ వరకు వచ్చిన వాటికి బిల్లుల చెల్లింపునకు పంపాలని అన్నారు. అదేవిధంగా లబ్దిదారులుగా ఉన్న పురుషుల కుటుంబాలకు చెందిన వాటిలో రేషన్ కార్డులో ఉన్న మహిళ పేరును ఖరారు చేస్తూ జాబితాను సమర్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా హౌసింగ్ అధికారి రవీందర్, అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస రావు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సంక్షేమానికి చిరునామా కాంగ్రెస్

### పాదయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**కాటారం, మహా :** రాష్ట్ర సంక్షేమానికి చిరునామా కాంగ్రెస్ పార్టీయేనని జై బాపు జై భీమ్ జై సంవిధాన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ జంగా రాఘవరెడ్డి, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీనుబాబు అన్నారు. సోమవారం కాటారం గాదపెల్లి గ్రామాలలో పాదయాత్ర నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి, మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్వాతంత్రం కోసం ఎంతో మంది మహనీయులు ప్రాణ త్యాగం చేశారని రాజ్యాంగాన్ని విచ్చిన్నం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని కాంగ్రెస్ పాలనలో రాజ్యాంగం పరిరక్షించబడిందన్నారు.నియోజకవర్గంలో సాగునీరు త్రాగునీరు విద్య అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఉందని రాబోయే కాలంలో ఐటి పార్క్ తో పాటు కంటి ఆసుపత్రికి నిర్మాణం జరగబోతున్నదని తెలిపారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోకుండా అభివృద్ధి కోసం కృషి చేస్తున్నమని అదే బాటలో పయనిస్తామని వెల్లడించారు. రాజ్యాంగం పరిరక్షణకు నడుం బిగించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాటారం మండలంలోని గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నెల 14 వరకు జరుగుతుందని అన్ని గ్రామాలలో నాయకులు ,కార్యకర్తలు భాగస్వాములై ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేడ్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అనగదొక్కాలని చూస్తుందన్నారు. అమిత్ షా అంబెడ్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. బి.ఆర్.ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని తెలంగాణ ఉద్యమకారులకు ఎవరిని ఆదుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ అనుబంద సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు ముహూర్తం ఖరారు

- వారం రోజుల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేత
- లింగంపల్లి గేటు వద్ద డబల్ బెడ్ రూంల పరిశీలన
- ఇండ్లను పరిశీలించిన ఆర్టీవో, కాంగ్రెస్ నాయకులు



**ఇబ్రహీం పట్నం, మహా:** మంచాల మండలం, లింగంపల్లి గేటు వద్ద గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మోక్షం లభించింది. వారం రోజుల లోపు ఇండ్లను ఎమ్మెల్యే రంగారెడ్డి ప్రారంభించనున్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, లింగంపల్లి గేటు వద్ద నిర్మించి ఉన్న డబల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... మంచాల మండలం నోముల రెవెన్యూ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, 96 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్ ఇచ్చారే తప్ప ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని గతంలో ఎవరికైతే సర్టిఫికెట్లు అందజేశారో, వారికి లక్కీ డ్రా ద్వారా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఇళ్లను కేటాయించడం జరుగుతుందని ఆర్డిఓ అనంతరెడ్డి వెల్లడించారు. అధికారులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. త్వరలో ఈ డబల్ బెడ్ రూమ్లను ఎమ్మెల్యే మల్ రంగారెడ్డి ప్రారంభం చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పరిగూడ పిఏసిఎస్ చైర్మన్ పాండురంగా రెడ్డి, ఎంపిడిఓ బాలశంకర్, ఎమ్మార్వో ఎంవివి ప్రసాద్ రావు, ఎంపిఓ ఉమా రాణి, ఆర్ఐ రమేష్, హౌసింగ్ ఏఇ రాం చంద్రయ్య, కాంగ్రెస్ జెనిగే వెంకటేష్, ఎడ్మ నరేందర్ రెడ్డి, రావుల మల్లేష్, పేరక మూర్తి, కరుణాకర్ రెడ్డి, భరత్ రెడ్డి, ఐలేష్, పల్లాటి రవి, కసరమోనీ రాజేష్ తదితరులు ఉన్నారు.

## గ్రీవెన్స్ లో ఫిర్యాదులు గణం పరిష్కారాలు శూన్యం

- రెండేళ్లుగా 16 సార్లు ఫిర్యాదు చేసిన బాధితురాలు
- కమిషనర్ ఆదేశాలు పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



**వరంగల్, మహా:** వరంగల్ నగరంలోని 40వ డివిజన్ కు చెందిన మూసిపెట్ల సంధ్య, రెండేళ్ల క్రితం ఇంటి నెంబర్ 177184/1/3 ఈమె తన ఇంటి పక్కనున్న ఎం నరేందర్ అనే వ్యక్తి అక్రమంగా తమ స్థలంలోకి వచ్చి ఇంటి నిర్మాణాన్ని చేపట్టారనే వివాదం మొదలు కాగా ఆ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని అట్టి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో గత 2 సంవత్సరాలుగా 16 సార్లు ఫిర్యాదులు ఇవ్వడం జరుగుతూనే ఉంది. అయినప్పటికీ తమకు ఇప్పటివరకు తమ ఫిర్యాదులను టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని బల్దియా కమిషనర్ ఇంటి నెంబర్ 177184/1/1 గల అక్రమ నిర్మాణం పై వచ్చిన ఫిర్యాదులకు స్పందించి వారికి నోటీసులు జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరల ఈ సోమవారం ప్రజావాణికి ఫిర్యాదు చేసిన మాపై టౌన్ ప్లానింగ్ అధికారులు అపహస్యంగా మాట్లాడుతున్నారని కమిషనర్ ఆదేశాలు కూడా పక్కనపెట్టిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఫిర్యాదు ఇచ్చిన మమ్మలను ఇబ్బందులకు గురి చేస్తూ రెండు సంవత్సరాల తర్వాత మేము నిర్మించిన ఇంటిపై పెంట్ హౌస్ కు అనుమతులు లేవని తమకు షోకాజ్ నోటీసు ఇచ్చారని బాధితురాలు పత్రికా ముఖంగా తన బాధను వెలగక్కారు. ఇప్పటికైనా బల్దియా కమిషనర్ స్పందించి బాధ్యత తో విధులు నిర్వహించాల్సిన అధికారులు బాధ్యతలు మరిచి బాధితులను అపాస్యం చేయడం ఫిర్యాదులను పట్టించుకోకపోవడం పై తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితురాలు సంధ్య కోరుకుంటున్నారు.



## గ్రీవెన్స్ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ దివాకర టీఎస్
- ప్రజల నుంచి 35 దరఖాస్తులు స్వీకరణ

**ములుగు, మహా :** గ్రీవెన్స్ లో వివిధ సమస్యల పరిష్కారం కోసం చేసుకున్న దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 35 దరఖాస్తులను స్వీకరించారు. భూసమస్యలకు సంబంధించి 12, గృహ నిర్మాణాలకు సంబంధించి 2, పింఛన్ కోసం 3, ఉపాధి కల్పన కోసం ఒకటి, ఇతర శాఖలకు సంబంధించి 17దరఖాస్తులు అందాయి. పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని, అర్జీదారులకు అందుకు సంబంధించిన పురోగతిని తెలియజేయాలన్నారు. దరఖాస్తు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్ జీ, సంపత్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల అభివృద్ధి పనులు మే 4 లోగా పూర్తి చేయాలి



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాలేశ్వరంలో మే 15వ తేదీ నుండి జరిగే సరస్వతి పుష్కరాల కోసం జరుగుతున్న అభివృద్ధి పనులను మే 4వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించారు. మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మొదటగా విఐపి ఘాట్ వద్ద జరుగుతున్న ర్యాంప్ నిర్మాణం, సరస్వతి దేవి విగ్రహ ఏర్పాటుకు జరుగుతున్న నిర్మాణ పనులను, శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న మరుగు దొడ్ల పనులను పరిశీలించి, అక్కడి నుండి ప్రధాన ఘాట్ వద్ద జరుగుతున్న మరుగుదొడ్ల పనులను, విద్యుత్ స్థంబాల ఏర్పాటు, పుష్కర ఘాట్లలో స్నానఘట్టాలు, నిర్మాణ పనులను ఆర్ డబ్ల్యు ఎస్ ద్వారా నిర్మిస్తున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఈ.ఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే నెలలో కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కొన్ని చోట్ల శాశ్వత ప్రాతిపదికన పనుల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని త్వరిత గతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మరుగు దొడ్లు, మంచి నీరు, పుష్కర ఘాట్లలో స్నానఘట్టాలు, బట్టలు మార్చుకునే గదులు, చలువ పందిళ్ళ ఏర్పాటు చేయాలని మే 4వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. చేపట్టిన పనులలో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, డీపీఓ నారాయణ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, దేవస్థానం ఈ.ఓ మహేష్, పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పెద్ద వంగర, మహా:** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండల కేంద్రంలోని శ్రీరామ గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నేడు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర లభిస్తుందని ప్రభుత్వం అందించే బోనస్ కూడా వస్తుందని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎంతగానో సహాయపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి, డైరెక్టర్ ముత్యాల పూర్ణచందర్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని తమ ధాన్యాన్ని సరైన ధరకు విక్రయించుకోవాలని నేతలు సూచించారు.

## మామిడి తోటకు నిప్పు పెట్టిన దుండగులు





- రామకృష్ణాపూర్ లో 2వేలకు పైగా చెట్లు దగ్ధం
- సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న బాధితులు

**ములుగు, మహా :** పంట చేతికి వచ్చే దశలో మామిడి తోట అగ్నికి ఆహుతయింది. గుర్తు తెలియని వ్యక్తులు తోటకు ఒక మూలన నిప్పంటించడంతో మంటలు చెలరేగి మామిడి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని బూరుగుపేట గ్రామపంచాయతీ రామకృష్ణాపూర్ శివారులో మామిడి తోటలో సోమవారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన మొకిరాల తిరుపతిరావు అనే రైతు మామిడి తోట నిర్వహిస్తున్నాడు. అయితే సోమవారం ఉదయం 10గంటల సమయంలో మామిడి తోట సమీపంలోకి కొందరు వ్యక్తులు వచ్చి వెళ్లారని, అటువైపు నుంచి క్రమంగా మంటలు రావడం చూసి మంటలను ఆర్పేందుకు గ్రాస్థులను సహాయంగా తీసుకొని వచ్చేందుకు వెళ్లాడు. అంతలోనే గాలి తీవ్రతకు తోట అంతా మంటలు వ్యాపించి తీవ్రమయ్యాయి. ఈ సంఘటనలో తోట అంతా కాలిపోయిందని తిరుపతిరావు ఆవేదన వెలిబుచ్చారు. సుమారు 2వేలకు పైగా మామిడి చెట్లు దగ్ధమైనట్లు తెలిపారు. డ్రిప్ పైపులు కూడా కాలిపోయాయని, దీంతో సుమారు రూ.30లక్షల ఆస్తినష్టం జరిగిందన్నారు. కాగా, ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయనున్నట్లు రైతు వెల్లడించారు. చేతికచ్చిన పంట అగ్నికి ఆహుతి కావడంతో కుటుంబ సభ్యులు ఘొల్లుమన్నారు.

## శాశ్వత పరిష్కారం కోరుతూ వీధి వ్యాపారుల ధర్నా

- మైనారిటీ నాయకుల మద్దతు
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన



**ఆదిలాబాద్, మహా :** తమకు శాశ్వత పరిష్కారం చూపాలని వీధి వ్యాపారులు రోడ్డెక్కారు. తమ సమస్యను పరిష్కరించాలని ఆదిలాబాద్ పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మైనార్టీ నాయకుల మద్దతుతో ఆందోళనకు దిగారు. ఇటీవల అధికారులు రోడ్డు పక్కన ఉన్న షాపులను తొలగించడంతో తాము జీవనోపాధి కోల్పోయామనివాపోయారు.గతంలో తాము ఎక్కడైతే వ్యాపారాలు చేసుకునేవారమో తిరిగి అక్కడే వ్యాపారం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవల లక్కీడ్రా ద్వారా గణేష్ థియేటర్ స్థలంలో కేటాయించినా అవి తాత్కాలికమేనని అన్నారు.అలా కేటాయిస్తే వ్యాపారాలు సాగవని అన్నారు. ఒక వేళ గణేష్ థియేటర్ స్థలంలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతిస్తే మళ్లీ తొలగించకుండా పక్కగా లైసెన్స్ లాంటిది ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ముజాహిద్దీన్ , ఖిజార్ ,సిరాజ్ ఖద్రి, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## కంటి సమస్యల బాధితులకు ఉచిత శస్త్ర చికిత్సలు

### వైద్య శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**కాటారం , మహా :** కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల కోసం పుష్పగిరి హాస్పిటల్ సౌజన్యంతో సాతారం సబ్ డివిజన్లో మండలాన్ని వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిల్ల శ్రీనుబాబు కలెక్టర్ తో కలిసి శ్రీపాదరావు చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలకు ఉచిత కంటివైద్యం అందించేందుకు ఈనెల 14న కంటి హాస్పిటల్ భవన నిర్మాణం నకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. దుద్దిళ్ళ శ్రీపాద రావు 26వ వర్ధంతి సందర్భంగా పుష్పగిరి ఆసుపత్రి ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాల లో 2 రోజుల ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీను బాబు గమాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీ దుద్దిళ్ళ శ్రీపాద రావు 26వ వర్ధంతి సందర్భంగా కాటారం మండలం లో ఉచిత కంటి చికిత్స శిబిరం ఏర్పాటు చేసినందుకు పుష్పగిరి ఆసుపత్రి యాజమాన్యనికి కృతజ్ఞతలు తెలిపారు. కంటి చూపు లోపం ఉన్న ప్రతి ఒక్కరు వచ్చి కంటి పరీక్ష చేసుకోవాలని. చికిత్స అవసరం ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య సేవలు అందించి కంటి అద్దాలు ఇస్తారని తెలిపారు. మా కుటుంబంపై మీకున్న ప్రేమనురాగలకు దుద్దిళ్ళ కుటుంబం ఎల్లప్పుడూ సేవకులుగా ఉంటామని భవిష్యత్తులో పేద ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలను చేస్తామని రెండు రోజులు కొనసాగే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని శ్రీను బాబు కోరారు. వెయ్యిమందికి పైగా శిబిరానికి హాజరు ఉచిత కంటే వైద్య శిబిరంలో సుమారు 1000 మందికి పైగా పాల్గొన్నారు. మూడు ప్రదేశాలలో కంటి పరీక్షల చేయగా శస్త్ర చికిత్సలు అవసరమున్న వారిని గుర్తించారు. ఆపరేషన్లు చేయాల్సిన వారికి హైదరాబాదులో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

## యాసంగి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్, మహా:** యాసంగి ధాన్యం కొనుగోలు కోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలసి సహకార శాఖ ,ఐకెపి, రెవెన్యూ ,వ్యవసాయ శాఖ, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..**

జిల్లాలో 2024 25 సంవత్సరానికి జిల్లాలో సుమారు 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. లక్ష 90 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం, 30 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం.. మొత్తం 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మొత్తం 107 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సహకార శాఖ ఆధ్వర్యంలో, అలాగే ఐకేపీ ఆధ్వర్యంలో 60 కొనుగోలు కేంద్రాలు, 2 మెప్మా కొనుగోలు కేంద్రాలు, ఎఫ్ పి ఓ ఆధ్వర్యంలో 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.యాసంగిలో జిల్లాలో పండిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ కౌసల్య దేవి, డీసీఎస్ఓ కిష్టయ్య,, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సంధ్యారాణి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మారెటింగ్ అధికారి సురేఖ, జిల్లా సహకార అధికారి నీరజ, మెప్మా డి ఎం సి రేణుక, తదితరులు, పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక



**వరంగల్, మహా:** వరంగల్ నగరంలోని 27వ డివిజన్ పరిధిలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందరు కలిసి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీ.పి.సి.సి కార్యదర్శి మీసాల ప్రకాష్, 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎర్రం కమల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గూడా శారద, కొత్తకొండ రేష్మ, వార్డ్ ఆఫీసర్ సురేష్, ఆర్పీలు పాల్గొన్నారు.




## మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీలో కలపాలని బైక్ ర్యాలీ

**ఇబ్రహీం పట్నం, మహా:** మహేశ్వరం మండలంలోని 33 గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గత కొన్ని రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు. ఇందులో భాగంగానే జేఏసీ అధ్యక్షులు రఘుపతి ఆధ్వర్యంలో సోమవారం మహేశ్వరం మండల కేంద్రం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు 400 బైక్ లతో ర్యాలీగా వచ్చి, రంగారెడ్డి జిల్లా డిఆర్ఓకు వినతి పత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ... మహేశ్వరం మండలంలోని మొత్తం 33 గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని, జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబును కలవడం జరిగిందన్నారు. మహేశ్వరాన్ని ఫ్యూచర్ సిటీలో కలిపితే మా గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయని, అలాగే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు. ఫ్యూచర్ సిటీలో మండలాన్ని కాలపాలని బీజేపీ, బిఆర్ఎస్, బిఎస్పి, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు కలిసి రావడం అభినందనీయం అన్నారు. ఫ్యూచర్ సిటీలో కలపకపోతే ఉద్యమాన్ని మరింత బలంపేతం చేస్తామన్నారు. అనంతరం డిఆర్ఓకు వినతి పత్రం అందజేశారు .

**పోలీసులకు నాయకులకు వాగ్వాదం...**

కలెక్టరేట్ కార్యాలయం ముందు ఉధృత వాతావరణ చోటుచేసుకుంది. మహేశ్వరం మండల కేంద్రం నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీని నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులతో ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు వాగ్వాదానికి దిగారు. పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట, మాటల యుద్ధం నడిచింది. శాంతియుత ర్యాలీనీ సైతం అడ్డుకుంటారా అని జేఏసీ నాయకులు మండిపడ్డారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ర్యాలీ నిర్వహించుకోవాలని సిఐ తెలపడంతో, విజయవంతంగా ర్యాలీని నిర్వహించారు. నిన్న సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాపాలనలో, మహేశ్వరం మండలంలోని 33 గ్రామాలను, రాబోయే తరాలకు నిర్మించబోయే ఫ్యూచర్ సిటీలో కలపాలని వినతి పత్రం అందజేసిన మహేశ్వరం జేఏసీ అధ్యక్షులు, నాయకులు. ఈ కార్యక్రమంలో మండల జేఏసీ నాయకులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే విద్య

### హనుమకొండి డిప్యూటీ డీఎంహోచ్వో పోరిక రవీందర్




**ములుగు, మహా :** విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే విద్య అని, ఆవిధానంతో పాఠశాలలో బోధన జరగడం అభినందనీయమని హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ పోరిక రవీందర్, డాక్టర్ ఎం.శ్రవణ్ కుమార్ అన్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఫుడ్ ఫెస్టివల్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలకు ప్రాధాన్యత గురించి తెలియజేయడానికి ఫుడ్ ఫెస్టివల్స్ దోహదపడతాయన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల వంటకాలు రుచికరంగా ఉన్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సన్రైజర్స్ స్కూల్ కరస్పాండెంట్ పెట్టెం రాజు, వైస్ ప్రిన్సిపాల్ బల్గూరి జనార్ధన్ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అజ్ఞాతం వీడి జన జీవన స్రవంతిలో కలవండి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ, మహా:** మావోయిస్టులు అజ్ఞాత వీడి జన జీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మావోయిస్టులకు పిలుపునిచ్చారు. గత ఫిబ్రవరి 21వ తారీఖున వరంగల్ పోలీస్ కమిషనర్ ఎదుట లొంగిపోయిన నిషేధిత మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యురాలు వంజం కేశే అలియాస్ జెన్నీకి ఆమె పై ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లక్షల రివార్డ్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా లొంగిపోయిన మహిళా మావోయిస్టుకి అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అడవి బాట పట్టిన మావోయిస్టులు హింసను వదిలి జనం మధ్యలోకి రావాలని, లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను అందుకొని మీ కుటుంబాలతో ప్రశాంతంగా కొనసాగించాల్సిందిగా పోలీస్ కమిషనర్ మావోయిస్టులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీ లు జితేందర్ రెడ్డి, తిరుమల్, కాజీపేట ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే దొంతి

- పేదవారి ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం పంపిణీ
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండల కేంద్రంలో రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యంతో ఖానాపురం మండలానికి చెందిన లబ్ధిదారుడైన ముస్తఫా ఇంట్లోలో ఏర్పాటు చేసిన సన్న బియ్యం భోజనం చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి. ఎమ్మెల్యే తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఆర్డిఓ ఉమారాణి, తాసిల్దార్,అధికారులు, తోపాటు గ్రామస్తులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే దొంతి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడుతుందని, ఉచిత సన్న బియ్యం పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమని, పేద ప్రజలు ఆకలితో బాధపడకుండా పోషకాహారాన్ని పొందాలన్నదే ఈ పథకం యెక్క ప్రధాన ఉద్దేశమని వివరించారు. సన్న బియ్యం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేని విధంగా చర్యలు తీసుకోవాలని,పంపిణీ వ్యవస్థలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. రేషన్ కార్డు లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం,ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇప్పుడు ఖరీదు చేసే అవసరం లేకుండా ప్రభుత్వమే ఉచితంగా సన్న బియ్యం అందిస్తున్నందుకు రాష్ట్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే ను పరామర్శించిన
# మాజీ మంత్రి



**హన్మకొండ, మహా:** మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ను మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పరామర్శించారు. హనుమకొండలో ఇటీవల శంకర్ నాయక్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అక్కడే రోహిణి హాస్పిటల్ లో వైద్య చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి సత్యవతి రాథోడ్ ఆయనను పరామర్శించి శంకర్ నాయక్ ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందిన తర్వాత తాను ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నానని సత్యవతి రాథోడ్ కు శంకర్ నాయక్ చెప్పారు. తగినంత విశ్రాంతి తీసుకుని మళ్లీ కార్యక్షేత్రంలోకి రావాలని శంకర్ ను సత్యవతి రాథోడ్ కోరారు.

### మన ఊరు మనబడి..మనబస్తీ మనబడి
# అభివృద్ధి పనులపై సమీక్ష



**వరంగల్, మహా:** జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం మన ఊరు మనబడి మన బస్తీ మన బడి.. పథకం కింద మంజూరు అయినా పనులు పెండింగ్ సమస్యలపై సంబంధిత ఇంజనీర్ శాఖల అధికారులు , ఎంఈవోలు లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డి ఆర్ వో విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్లు పాల్గొని ఏంఒ ఎంబీ పనుల పెండెన్సీ పై సమీక్ష నిర్వహించడమైనది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు మనబడి కింద మంజూరు అయిన పనుల వివరాలు, అడ్మినిస్ట్రేషన్ మంజూరు, పూర్తి వివరాలతో ఎంబి లు సమర్పించవలసిందుగా ఎంఈఓలు మరియు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఇ ఈ ఇజ్జగిరి, ఆర్ అండ్ బి ఈ ఈ,సంబంధిత శాఖల అధికారులు స్కూల్ హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులందరికీ బీమా ప్రీమియం చెల్లించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** జిల్లాలో పనిచేస్తున్న సుమారు 2700 పారిశుధ్య కార్మికులందరికీ బీమా ప్రీమియం చెల్లించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. మరణించిన ఇద్దరు పారిశుధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు సోమవారం ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ చెక్కులు పంపిణీ చేశారు. ఇల్లందకుంట మండలం మల్యాల కు చెందిన గురుకొండ రాజబాబు, శ్రీరాముల పల్లెకు చెందిన తిరుపతి మరణించగా వారి కుటుంబ సభ్యులకు పి.ఎం.జె.జె.బి.వై పథకం ద్వారా మంజూరైన రూ.రెండు లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఎందుకు సంబంధించిన ప్రీమియం గత ఏడాది జిల్లా యంత్రాంగమే చెల్లించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో జిల్లా యంత్రాంగం తరఫున జిల్లాలోని సుమారు 2700 మంది పారిశుద్ధ్య కార్మికులకు బీమా ప్రీమియం చెల్లించామని గుర్తు చేశారు. కార్మికుల నుండి ఒక్క రూపాయి తీసుకోకుండా సుమారు పది లక్షల రూపాయల వరకు బీమా చెల్లి ప్రీమియం చెల్లించిందని అన్నారు. వివిధ కారణాలవల్ల కార్మికులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఈ ఏడాది కూడా కార్మికులందరికీ బీమా ప్రీమియం జిల్లా యంత్రాంగం ద్వారానే చెల్లించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు నిర్వహించి కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని, అందరికీ హెల్త్ కార్డులు అందజేయాలని అన్నారు. గతంలో యూనిసెఫ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపుల ద్వారా కొందరు పారిశుధ్య కార్మికుల్లో టీబీ వ్యాధిని గుర్తించి చికిత్స అందిస్తున్నామని, న్యూట్రిషన్ కిట్టు తో పాటు ప్రతి నెలా వేయి రూపాయలు అందజేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపల్ కార్మికులకు రూ.20 లక్షల బీమా ప్రీమియం చెల్లించిన మున్సిపల్ కమిషనర్ ఆయూబ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, డిటిడిఓ పవన్ కుమార్, ఆర్డిఓ మహేశ్వర్, యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్ స్వామి, ఎల్డీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ పనుల పురోగతిని
## వివరించిన కమిషనర్



**వరంగల్, మహా:** కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ & అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ప్రధాన కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భం గా దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహించిన సమీక్ష లో కేంద్ర హౌసింగ్ & అర్బన్ ఎఫైర్స్ మంత్రి వర్యులు మనోహర్ లాల్ కట్టర్ పాల్గొని దేశ వ్యాప్తం గా కొనసాగుతున్న స్మార్ట్ సిటీ పనుల పురోగతిని ప్రాజెక్ట్ కొనసాగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరం లో స్మార్ట్ సిటీ కింద చేపట్టబడి కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కమిషనర్ మంత్రి కి వివరించారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, స్మార్ట్ సిటీ పి ఎం సి భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి సమాచారం తో డైరీ రూపకల్పన భేష్

- నగర మేయర్ గుండు సుధారాణి
- జేఏసీ డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరించిన మేయర్, కమీషనర్



**వరంగల్, మహా:** పూర్తి సమాచారంతో డైరీ రూపకల్పన చేయడం భేష్ అని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసి) ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై డైరీ క్యాలెండర్ లను సంయుక్తం గా ఆవిష్కరించారు. అనంతరం జే ఏ సి కోశాధికారి స్వర్ణన్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశం లో మేయర్ మాట్లాడుతూ డైరీ రూపకల్పన చాలా శ్రమతో పాటు వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని, ఇందుకోసం కార్పొరేషన్ కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరచటం అభినందనీయం అని గత 15 సం.ల సుదీర్ఘకాలం గా నిర్విరామంగా జే ఏ సి ఆధ్వర్యం లో డైరీని రూపొందించడం హర్షణీయం అని ముఖ్యం గా ఉద్యోగులు సిబ్బంది రోజు వారిగా చేయాల్సిన విధి నిర్వహణను నమోదు చేసుకొని అమలు చేయడానికి దైనందిని (డైరీ) ఎంతో ఉపయుక్తం అని మేయర్ అన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లో జే ఏ సి ముందు వరసలో ఉంటూ సహకరిస్తున్నారని డైరీ క్యాలెండర్ లను ఆవిష్కరించడం ఆనందం గా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో జే ఏ సి అధ్యక్షులు బోట్ల రమేష్, గౌరవ అధ్యక్షులు ధర్మ రాజు, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్ , కోశాధికారి స్వర్ణన్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, కార్యదర్శి బాలు నాయక్, ఉపాధ్యక్షులు రావుల ఆనంద్, తో పాటు ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సెక్రటరీ అలివేలు, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, హెచ్ ఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, మహా:** వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డి ఆర్ ఓ విజయలక్ష్మి, హౌసింగ్ పిడి గణపతిలు ప్రజల నుండి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడమైనది. ప్రజావాణి లో వివిధ శాఖల వారీగా స్వీకరించిన దరఖాస్తులు 93 కాగా వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై 41 దరఖాస్తులు రాగా, మిగతా శాఖలకు సంబంధించిన 52 దరకాస్తులు స్వీకరించారు. ముఖ్యమంత్రి ప్రజా దర్బార్ నుండి జిల్లాకు వచ్చిన వినతులు సంబంధిత శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని , లేని పక్షంలో సంబంధిత దరకాస్తుదారునికి అర్థమయ్యేలా వివరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో వారం వారం నిర్వహించే ప్రజావాణి లో ప్రజలు వివిధ సమస్యల పై వచ్చిన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని గ్రీవెన్స్ లాగిన్ లో ఎక్కువ మొత్తం పెండింగ్ లో ఉన్న శాఖ అధికారులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వేసవి కాలంలో తీవ్రంగా ఎండ ప్రభావం తీవ్రంగా ఉన్నందున ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆదేశించారు. జిల్లాలో పొలాలకు సాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సూచించారు. అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం

**దోర్నకల్,మహా:** మండుతున్న ఎండలకు ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు బురహాన్ పురం మాజీ హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాస్, పద్మావతి దంపతుల సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన డీఎస్పీ కొండం పార్థసారథి తెలిపారు. సోమవారం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మచ్చ సోమయ్య మెడికల్ దుకాణం ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు అనేక అవసరాల కు పట్టణ కేంద్రానికి వస్తుంటారు. వారి దాహార్తిని తీర్చేందుకు వాటర్ తో పాటు పాటు మజ్జిగ ను పంపిణీ చేస్తారన్నారు. ఈ వేసవి కాలం మొత్తం సుమారు రూ 10 లక్షలు అవుతుందన్నారు. ఈ రూ 10 లక్షలు మచ్చ పద్మావతి, శ్రీనివాస్ లే పెట్టుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకట రామారావు, మచ్చ వెంకటరామ నరసయ్య, ఉప్పల వెంకటేశ్వర్లు, సోమా కిరణ్ కుమార్, పువ్వాడ హరి ప్రసాద్, తల్లాడ సురేష్, బుద్ధా శ్రీనివాస్, కందిబండ ప్రసాద్, ఉప్పల వెంకన్న, తల్లాడ లోహిత్, గంధసిరి కృష్ణ,ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు.

# ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు
## దశరథ్ నాయక్ ముందస్తు అరెస్ట్

- చలో గిరిజన సంక్షేమ భవన్ కు పోనివ్వకుండా అడ్డుకున్న పోలీసులు
- పెండింగ్ లో ఉన్న 219 కోట్ల ట్రైకార్ సబ్సిడీ రుణాలు తక్షణమే విడుదల చేయాలి
- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్ డిమాండ్




**ఇబ్రహీం పట్నం, మహా:** లంబాడి హక్కుల పోరాట సమితి మరో పోరాటానికి సిద్ధమయింది. 201921 సంవత్సరానికి గాను ట్రైకార్ లో ఉన్న 219 కోట్లను వెంటనే మంజూరు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న బిల్లులను చెల్లించాలని సోమవారం గిరిజన సంఘాలు చలో గిరిజన సంక్షేమ భవన్ పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ ను కడ్తాల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ... గిరిజనులకు రావలసిన పెండింగ్ బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించి హడావిడి చేస్తుందని మండిపడ్డారు. గత ప్రభుత్వం ట్రైకార్ సంస్థ ద్వారా 201921 సంవత్సరంల్లో గిరిజన యువతి యువకుల నుండి వేలాది దరఖాస్తులు స్వీకరించి అందులో నుండి 30 వేల మందిని లబ్ధిదారులుగా గుర్తించిందని తెలిపారు. వారి ఖాతాల్లో జమ చేయడానికి 219 కోట్ల రూపాయల చెక్కును రెడీ చేసి ఆర్థిక శాఖకు పంపిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెంటనే పెండింగ్ బిల్లులు ఇస్తామని హామీ ఇవ్వడంతో సంతోషపడ్డారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాస్ పేరుతో 30 వేల మంది గిరిజన యువతి యువకులను మోసం చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు.

# సీసీఐ సాధన కమిటీ కార్యాచరణ వెల్లడి
## ఆదిలాబాద్ అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు



**ఆదిలాబాద్, మహా :** సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఒక ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్టు సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ అన్నారు. కో కన్వీనర్ విజ్జగిరినారాయణ తో పాటు అఖిల పక్ష నాయకులతో కలిసి ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్య భవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించారు. సీసీఐ ని తిరిగి తెరిపించేందుకు అఖిల పక్షం ఆధ్వర్యంలో ఇటీవలే దీక్షలకు దిగినట్టు తెలిసపారు. ఢిల్లీ కి వెళ్ళి కేంద్రమంత్రులను కలిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణకై కోరినట్టు తెలిపారు.కేంద్రం పై పెద్ద ఎత్తున ఒత్తిడి పెంచగలిగితే అనుకున్నది సాధించగలమన్న నమ్మకం ఏర్పడుతోందన్నారు. కేవలం సీసీఐ మాత్రమే కాకుండా వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా పారిశ్రామికంగా ,రవాణ , వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక ఉద్యమ కార్యాచరణతో ముందుకెళ్లనున్నట్టు వివరించారు. ఫ్యాక్టరీ పునప్రారంభం కోరుతూ ఎంపీ ఎమ్మెల్యేతో పాటు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కి మెమోరాండం, 8,9,10, తేదీలలో కరపత్రాల ద్వారా జిల్లాలో ప్రచారం, ఆదిలాబాద్ పట్టణం లోని అన్ని వార్డుల్లో సీసీఐ సాధన కమిటీల నిర్మాణం, ఈ నెల 11,12,13 తేదీల్లో గ్రామ, మండల కమిటీ ల నిర్మాణం , సమావేశాలు ప్రెస్ మీట్ లు నిర్వహించడం. 16 న రిటైర్డ్ ఉద్యోగులు మేధావుల కుల సంఘాలతో చర్చ గోష్టి, 22న న కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాలతో చర్చ వేదిక , అనంతరం విద్యార్థి యువజన సంఘాలు. రైతు సంఘాలు , వ్యవసాయ కార్మిక సంఘాలతో సమావేశాలు , మీడియా సమావేశాలు, కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి , లేదా ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు లేదా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివరావు ల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలవడం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ,మాజీ మంత్రి కేటీఆర్ లను కలవడం ,సీపీయం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ద్వారా హైదరాబాద్ లో అన్ని రాజకీయ పార్టీలతో చర్చ, మీడియా సమావేశం ఏర్పాటు చేయడం. సీసీఐ పునరుద్ధరణ విషయాన్ని వివరిస్తూ స్టిక్కర్స్, వాల్ పోస్టర్లను అంటించి ప్రచారం చేయడం. సాధన కమిటీ సభ్యులందరు ఈ ఉద్యమాన్ని ప్రజలల్లో ప్రచారం చేస్తూనే పట్టణ బందు కోసం ప్రణాళిక రూపొందించుకోవడం, అంతే కాకుండా ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో విమానాశ్రయం నిర్మాణం, ఆదిలాబాద్ నుండి అర్మూర్ వరకు రైల్వే లైన్ నిర్మాణం , జిల్లా కేంద్రం లో మెగా టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు సాధన కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కార్యాచరణ నిర్వహించినట్టు మీడియా సమావేశంలో వివరించారు.ఈ కార్యక్రమం లో సీసీఐ సాధన కమిటీ కో కన్వీనర్ లు లోకారి పోశెట్టి, కొండా రమేష్, సిర్ర దేవేందర్, వెంకట్ నారాయణ, భామన్ జగన్ సింగ్, ఈశ్వర్ దాస్, బండి ధాత్రాత్రి, సభ్యులు చిల్కా దేవిదాస్, దర్శనాల నగేష్, దాసరి రమేష్, బొజ్జ ఆశన్న, గోవర్ధన్ యాదవ్, విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన కార్పొరేటర్



**వరంగల్ మహా:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎంతో ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం 13వ డివిజన్ లోని ఎల్బీనగర్ లోని జాతీయ ఉత్పత్తి షాప్ నెంబర్ 4317236 లో సన్నబియ్యం కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ సురేష్ కుమార్ జోషి ప్రారంభించి మహిళాలకు స్థానికులకు సన్న బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్రమ్ కుద్దుస్, రవీందర్, సయ్యద్ ఆసిఫ్, మసూద్ బాయ్,రేషన్ షాప్ డీలర్,సోమేశ్వర్ స్థానికులు పాల్గొన్నారు.

### ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు
# సత్వరమే పరిష్కారం



**ఇబ్రహీం పట్నం, మహా:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి సంగీత స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (56) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ - 21, ఇతర శాఖలకు - 35, మొత్తం 56 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం



**జనగామ, మహా:** సమాజ సేవ, నాయకత్వం, సంక్షేమ కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ అంకితమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. పెద్దవంగర మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న లయన్స్ క్లబ్ కమ్యూనిటీ భవన భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లయన్స్ క్లబ్ భవన నిర్మాణానికి భూమి పూజా చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం అన్నారు. లయన్స్ క్లబ్ వారి సేవలు నిస్వార్థమైనవని పేర్కొన్నారు. 1996 నుండి లయన్ క్లబ్ పైన తనకు అవగహన ఉందని ఎంపీ తెలిపారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు విస్తృత చేయాలనే సదుద్దేశంతో పెద్ద వంగరలో భూమి పూజ చేసుకోవడం హర్షనియమన్నారు. లయన్స్ క్లబ్ కొరకు వరంగల్ లేదా తొర్రూర్ కి వెళ్ళడం సాధ్యం కాని వారికి ఇప్పుడు పెద్ద వంగరలొనే లైయన్స్ క్లబ్ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు లయన్స్ క్లబ్ ఎల్లవేళలా కృషి చేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. ఉచిత కంటి పరీక్షలతో పాటు ప్రయాణ ఖర్చులు అందించడం హర్షినీయం అన్నారు. ప్రస్తుత కాలంలో విద్య, వైద్యం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని ఎంపీ పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



- అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలి
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**హన్మకొండ, మహా:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ లో కొత్తూర్ బ్రిడ్జి వద్ద చాపల మార్కెట్ వద్ద సుమారు 25 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ మున్సిపల్ కమీషనర్ తానాజీ స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమాన్ తో కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. దశల వారిగా అన్ని డివిజన్ల లో సైడ్ డ్రైన్, సీసీ రోడ్ల పనులను చేస్తున్నామని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీ వాసులు ప్రభుత్వానికి సంహరించాలని కోరారు. కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచామని మళ్ళీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వంలో త్వరలో అర్హులకు రేషన్ కార్డులను,డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారికీ ప్రభుత్వం సన్నద్ధం అవుతుందని అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి సంక్షేమం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, కోడెపాక గణేష్, సురేష్ బాబు, ముప్పిడి శ్రవణ్, రాజేశ్వరి, అనిత, గుత్తికొండ సురేందర్, శ్రీకాంత్, స్వప్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులు త్వరగా పరిష్కరించాలి

### హన్మకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య



**హన్మకొండ, మహా:** వివిధ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ లో ప్రజలు అందించిన వినతులను వెంటనే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత జిల్లా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై వినతులతో వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ 106 వినతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు పాల్గొన్నారు.



# ఇల్లు ఏదైనా సరే.. ఇది ఉండాల్సిందే!

1,2,3 బీహెచ్‌కే.. ఇల్లు ఏదైనా సరే బాల్కనీ ఉండాల్సిందే.. గృహ కొనుగోలుదారులు నిర్మాణం నాణ్యత, ప్రాంతం, ధర, వసతులతో పాటు బాల్కనీకి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో ఇంటిలోని ప్రతి అంగుళం స్థలాన్ని వినియోగించాలని భావించిన కస్టమర్లు.. ప్రస్తుతం ఎక్కువ ఓపెన్ స్పేస్ ఉండాలని కోరుకుంటున్నారు. 75 శాతం మంది బాల్కనీ ఉండే ఇళ్ల కొనుగోళ్లకే ఆసక్తి చూపిస్తున్నారని ఫిక్కీ, అనరాక్ సర్వేలో వెల్లడించింది. అలాగే 74 శాతం మంది కస్టమర్లు నాణ్యమైన నిర్మాణాలకే మొగ్గు చూపిస్తున్నారు. గృహాల ధరలు పెరుగుతున్నప్పటికీ కొనుగోలుదారులు విశాలమైన ఇళ్లకే ఆసక్తి చూపిస్తున్నారు. 50 శాతం మంది కస్టమర్లు 3 బీహెచ్‌కే కొనుగోలుకు ఆసక్తి చూపిస్తే.. 38 శాతం మంది 2 బీహెచ్‌కే గృహాలకు మొగ్గు చూపిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఎన్‌సీఆర్ నగరాలలో 3బీహెచ్‌కే యూనిట్లకు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. అధిక ధరల కారణంగా ముంబైలో 44 శాతం మంది కస్టమర్లు 2 బీహెచ్‌కేలకు, 17 శాతం 1 బీహెచ్‌కేలకు ఆసక్తి చూపిస్తున్నారు. పుణేలో 10 శాతం కొనుగోలుదారులు 1 బీహెచ్‌కే జై కొడుతున్నారు.

**లగ్జరీ ఇళ్లకు డిమాండ్..**

రూ.కోటిన్నర ధర ఉన్న గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. 2023 హెచ్-2లో 20 శాతం మంది లగ్జరీ ఇళ్లకు ఆసక్తి చూపించగా.. 2021 హెచ్-2లో ఇది కేవలం 12 శాతంగా ఉంది. రూ.45-90 లక్షల బడ్జెట్ గృహాలకు 33 శాతం మంది మొగ్గు చూపిస్తున్నారు. ఇక అందుబాటు గృహాలకు డిమాండ్ క్రమంగా తగ్గిపోతోంది. 2020 హెచ్-2లో 40 శాతంగా అఫర్డబుల్ హౌసింగ్ గిరాకీ.. 2021 హెచ్-2 నాటికి 25 శాతానికి, 2023 హెచ్-2లో ఏకంగా 21 శాతానికి క్షీణించింది.

**లాంచింగ్‌లో కొంటున్నారు..**

గృహ కొనుగోలుదారుల అభిరుచి మారింది. గతంలో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న వాటిల్లో కొనేందుకు ఆసక్తి చూపిన కస్టమర్లు.. ప్రస్తుతం లాంచింగ్ ప్రాజెక్టలలో కొనేందుకు ఇష్టపడుతున్నారు. 2020లో రెడీ టూ మూవ్, లాంచింగ్ ప్రాజెక్టలలో కొనుగోళ్ల నిష్పత్తి 46:18 శాతంగా ఉండగా.. 2024 నాటికి 23:24 శాతానికి మారింది. అలాగే 2021లో శివారు ప్రాంతాలలో స్థిరాస్తుల కొనుగోలుకు జై కొట్టిన కొనుగోలుదారులు 2024 నాటికి 36 శాతానికి తగ్గారు.

## పెట్టుబడులకు రియలే బెటర్..

ఏటా దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఫ్లాట్ల విస్తీర్ణాలు 11 శాతం మేర పెరుగుతున్నాయి. 2022లో 1,175 చ.అ.లుగా ఉన్న సగటు ఫ్లాట్ల సైజు.. 2024 నాటికి 1,300 చ.అ.లకు పెరిగాయి. 58 శాతం మిలీనియల్స్, 39 శాతం జెన్స్–ఎక్స్ కస్టమర్లు ఇతర పెట్టుబడుల నుంచి వచ్చిన లాభాలతో ఇళ్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. 57 శాతం మంది రియల్ ఎస్టేట్ అత్యంత ప్రాధాన్య పెట్టుబడిగా విశ్వసిస్తున్నారు. ఇందులోనూ 36 శాతం మంది నివాస విభాగంలో పెట్టుబడులకే ఆసక్తి చూపిస్తున్నారు. గృహ రుణ వడ్డీ రేట్లు 8.5 శాతం కంటే తక్కువగా ఉన్నంత కాలం ఇంటి కొనుగోలు నిర్ణయంపై ప్రభావం ఉండదని చెప్పారు.

# స్టాక్ మార్కెట్లు భారీ పతనం.. టాప్ లూజర్ టాటా స్టీల్

దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా పతనమయ్యాయి. భారతీయ బెంచ్ మార్క్ ఈక్విటీ సూచీలు కౌంటర్లలో విస్తృత స్థాయి అమ్మకాలతో వరుసగా మూడో సెషన్ లో తీవ్ర నష్టాల్లో స్థిరపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 2226.79 పాయింట్లు (2.95 శాతం) క్షీణించి 73,137.90 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 కూడా 742.85 పాయింట్లు (3.24 శాతం) నష్టంతో 22,161.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ లోని మొత్తం 30 షేర్లు నష్టాల్లోనే స్థిరపడగా టాటా స్టీల్ అత్యధికంగా 7.16 శాతం నష్టపోయింది. ఒక్క రోజులో మార్కెట్ పతనం గత పది నెలల్లో ఇదే అత్యధికం. బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.403 లక్షల కోట్ల నుంచి రూ.389 లక్షల కోట్లకు పడిపోయింది. దీంతో మదుపరుల సంపద ఒక్క రోజులో రూ.14 లక్షల కోట్లు ఆవిరైంది. వృద్ధిపై పెరుగుతున్న ఆందోళనలు, అమెరికా సుంకాల పతనం మార్కెట్ పతనానికి కారణమయ్యాయి. ఇది ప్రస్తుత రిస్క్ఆఫ్ సెంటిమెంట్‌ను మరింత తీవ్రతరం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటనలు, వాటికి ప్రతిగా చైనా తీసుకున్న ప్రతీకార చర్యలే ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ప్రపంచ దేశాలపై సుంకాల విధింపుతో గ్లోబల్ స్టాక్ మార్కెట్‌లో అనిశ్చితి , మాంద్యం భయాలు,అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ అపార నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ప్రపంచ ఆర్థిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ ట్రంప్ మాత్రం తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండబోదని భీష్మించుకున్నారు. ఈ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లలో సైతం అమ్మకాలకు తెరలేచే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. 2020 తరువాత గత వారం యూఎస్ మార్కెట్లు 6 శాతం పడిపోయాయి. 5 లక్షల కోట్ల డాలర్లకుపైగా మార్కెట్ విలువ ఆవిరైంది. ఈ వారం దేశీ మార్కెట్లు పతన బాటలో సాగవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. కాగా.. వచ్చే గురువారం (ఏప్రిల్ 10) మహావీర్ జయంతి సందర్భంగా మార్కెట్లు పనిచేయవు. దీంతో ట్రేడింగ్ ఈవారం 4 రోజులకే పరిమితంకానుంది.



# దేశవ్యాప్తంగా రూ.50 పెరిగిన వంట గ్యాస్ ధరలు



కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచిన వెంటనే.. గ్యాస్ ధరల పెంపు కూడా జరిగింది. ఎల్‌పీజీ వంట గ్యాస్ సిలిండర్ ధర రూ. 50 పెరిగింది. ఇది ఉజ్వల పథకం సిలిండర్లకు వర్తిస్తుంది. ఈ ధరలు రేపటి నుంచి అమలులోకి రానున్నాయి. ధరల పెరుగుదల గురించి కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి మాట్లాడుతూ.. 14.2 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 500 నుంచి రూ. 550కు పెరిగింది. ఈ ధర ప్రధాన మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు వర్తిస్తుంది. ఇతరులు రూ. 853 చెల్లించాల్సి (ధరల పెరుగుదలకు ముందు ఈ ధర రూ. 803గా ఉండేది) ఉంటుంది. ఈ సందర్భంగా పెట్రోల్, డీజిల్ పై ఇటీవల ఎక్సైజ్ సుంకం పెంపు వినియోగదారులపై భారం మోపడానికి ఉద్దేశించినది కాదు. సబ్సిడీ గ్యాస్ ధరల కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొన్న 43,000 కోట్ల నష్టాన్ని భర్తీ చేయడానికి ఇది సహాయపడుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# తగ్గుతాయ్..

దేశంలోని రుణగ్రహీతలకు శుభవార్త. అతిపెద్ద ప్రైవేటు బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (HDFC Bank) తన ఎంసీఎల్‌ఆర్ (వడ్డీ రేటు)ను 10 బేసిస్ పాయింట్లు తగ్గించింది. సవరించిన తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎంసీఎల్‌ఆర్ 9.10 శాతం నుంచి 9.35 శాతం మధ్య ఉంటుంది. సవరించిన రేట్లు ఏప్రిల్ 7 నుంచి వర్తిస్తాయి.

**ఎంసీఎల్‌ఆర్.. దాని ప్రభావం**

మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్ బేస్డ్ లెండింగ్ రేట్ లేదా ఎంసీఎల్‌ఆర్ అనేది ఒక నిర్దిష్ట రుణం కోసం బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థలు వసూలు చేయాల్సిన కనీస వడ్డీ రేటు. ఇది రుణానికి వడ్డీ రేటు తక్కువ పరిమితిని నిర్దేశిస్తుంది. ఆర్బీఐ 2016లో ఎంసీఎల్‌ఆర్‌ను ప్రవేశపెట్టింది. గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు, వాహన రుణాలతో సహా వివిధ ఫ్లోటింగ్‌రేట్ రుణాలపై వడ్డీ రేట్లను నిర్ణయించడానికి బ్యాంకులు ఉపయోగించే బెంచ్‌మార్క్ రేటును ఎంసీఎల్‌ఆర్ అంటారు. ఈ ఎంసీఎల్‌ఆర్ తగ్గడం వల్ల రుణ ఈఎంఐలు లేదా రుణ కాలపరిమితి తగ్గుతుంది. ఇది దీర్ఘకాలికంగా రుణగ్రహీతలకు ప్రయోజనం చేకూరుస్తుంది. అయితే ఈ ప్రయోజనం పరిధి, సమయం రుణ ఒప్పందంలో పేర్కొన్న రీసెట్ క్లాజ్‌పై ఆధారపడి ఉంటుంది.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణ రేట్లు

ఓవర్నైట్, ఒక నెల ఎంసీఎల్‌ఆర్ కాలపరిమితిని 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 9.20 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించింది. మూడు నెలల ఎంసీఎల్‌ఆర్‌ను 9.30 శాతం నుంచి 9.20 శాతానికి, ఆరు నెలల ఎంసీఎల్‌ఆర్‌ను 9.40 శాతం నుంచి 9.30 శాతానికి తగ్గించింది. ఏడాది, రెండేళ్ల ఎంసీఎల్‌ఆర్ రేటును 9.40 శాతం నుంచి 9.30 శాతానికి తగ్గించింది. మూడేళ్ల ఎంసీఎల్‌ఆర్ను 9.45 శాతం నుంచి 9.35 శాతానికి తగ్గించింది.



# దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL





# వరల్డ్ రికార్డ్ సృష్టించిన ఎలుక

## దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన హీరో

ఓ మూషికం సరికొత్త రికార్డ్‌లను సృష్టించింది. బాంబుల నుంచి ఓ దేశాన్ని కాపాడడంలో పాత రికార్డ్‌లన్నీ తిరగ రాసింది. దీంతో ప్రపంచంలోనే అత్యధికంగా బాంబులు గుర్తించిన ఎలుకల జాబితాలో తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది. గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కెక్కింది. కాంబోడియా దేశానికి చెందిన భూముల్లో ఉన్న బాంబులను గుర్తించడమే ఎలుక రోనిన్ పని. తాజాగా రోనిన్ బాంబుల వేటలో ప్రపంచంలోనే తొలిసారి వందకు పైగా ల్యాండ్‌మైన్లు, ఇతర యుద్ధ అవశేషాలను గుర్తించిన ఎలుకగా కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. అఫ్రికన్ జెయింట్ పౌచ్‌డ్ రాట్ రోనిన్ 2021 నుండి ఇప్పటి వరకు భూమిలో దాచిన 109 బాంబులు, 15 పేలని బాంబులను గుర్తించినట్లు జంతువులకు శిక్షణ ఇచ్చే ఏపోపో అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది. తద్వారా రోనిన్ ఇప్పుడు ఎలుకలలో అత్యధిక మైన్లు గుర్తించిన రికార్డును సొంతం చేసుకుందని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా, కాంబోడియా ప్రజల ప్రాణాల్ని కాపాడడంలో రొనిన్ బాధ్యతలు అత్యద్భుతమని కొనియాడింది. ఎలుక రోనిన్ గురించి పలు ఆసక్తిర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐదేళ్ల వయస్సున్న రోనిన్ మంచి పనిమంతుడు. అందరితో స్నేహంగా ఉండటమే కాదు..శాంతంగా ఉంటాడట. రోనిన్ విజయానికి కారణం ఏకాగ్రత, ఒత్తిడిలో ఎలాంటి ఆందోళన చెందకుండా ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించడంలో సిద్ధహస్తుడు. అంతేకాదు, రోనిన్ తెలివితేటలు, సహజమైన ఆసక్తి నిత్యం చురుగ్గా ఉంచేందుకు దోహదం చేస్తున్నాయి. అందుకే కాబోలు భూమిలో బాంబులు గుర్తించడం రోనిన్‌కు ఒక ఆటలా ఉంటుంది' అని ఏపోపో ప్రతినిధి లిల్లీ షాలోమ్ అన్నారు. రోనిన్ సంరక్షణ చూసుకునే ఫానీ మాట్లాడుతూ.. 'రోనిన్ విజయాలు ఎలుకల అసాధారణ సామర్థ్యానికి నిదర్శనం. రోనిన్‌ను కేవలం బాంబుల్ని నిర్వీర్యం చేసే ఎలుక అని అనుకోం. మేం అతన్ని ఫ్రెండ్‌గా, సహచరుడిగా భావిస్తాం' అని అన్నారు. ఏపోపో సంస్థ దాదాపు ముప్పై సంవత్సరాలుగా భూమిలోని బాంబులను గుర్తించేందుకు ఎలుకలకు శిక్షణ ఇస్తోంది. రోనిన్,అతని సహచరులు ప్రతి రోజూ మైన్లు ఉండే ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తారు. మైన్లు ఉన్నాయన్న అనుమానం ఉన్న ప్రదేశాల్లో వాటిని విడిచిపెడతారు. ఎలుక తమ అసాధారణమైన ప్రతిభతో మైన్లు ఉన్న ప్రదేశంపై ఉన్న మట్టిని కొరుకుతాయి. అలా ఓ నిర్ధిష్ట వయస్సు వచ్చిన తర్వాత విధుల నుంచి పదవీ విరమణ చేస్తాయి. కాంబోడియాలో ఇరవై ఏళ్ల పాటు అంతర్యుద్ధాలు జరిగాయి. చివరికి యుద్ధాలు 1998లో ముగిశాయి. అయినప్పటికీ ఇంకా ప్రపంచంలో అత్యధికంగా ల్యాండ్ మైన్‌లు ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటిగా ఉంది. ఇప్పటికీ 40 లక్షల నుంచి 60 లక్షల మధ్యలో కాంబోడియా భూముల్లో ల్యాండ్ మైన్లతో పాటు ఇంకా పేలని పేలుడు పదార్థాలు ఉన్నట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. అలాగే ఈ దేశంలో సగటున 40వేల మందికి పైగా ఈ ల్యాండ్ మైన్ల వల్ల కాళ్లను పోగొట్టుకున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. రోనిన్‌కు ముందు మగావా అనే ఎలుకనే అత్యధిక బాంబులు గుర్తించాడు. మగావా 2021లో పదవీ విరమణ చేసినప్పటికీ, అయిదేళ్ల కాలంలో 71 మైన్లు, 38 పేలని బాంబులను గుర్తించాడు. అతడికి సేవల గుర్తింపుగా పీడీఎస్ఏ అనే జంతు సంక్షేమ సంస్థ నుండి సాహస వీరుడి పతాకాన్ని అందుకున్నాడు. 2022 జనవరిలో వృద్ధాప్యంతో మగవా మరణించాడు.

# అసమానతలను అర్థం చేసుకోండి : బిల్‌గేట్స్



మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రపంచంలోనే అత్యంత దానగుణం కలిగిన వ్యక్తిగా పేరొందిన బిల్ గేట్స్(Bill Gates) భారతీయ యువతకు అమూల్యమైన సలహా అందించారు. 'ప్రయాణాలు చేయండి.. మీకు ఉన్నటువంటి అవకాశాలను పొందలేనివారిని చూసి, పరిస్థితులను అర్థం చేసుకోండి' అని బిల్‌గేట్స్ అన్నారు. ఈ మాటను అనుసరించే యువతీయువకులు వారి దృక్పథాన్ని విస్తృతం చేసుకుంటుంటారని, ప్రపంచంలోని విభిన్న జీవన పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తారనే భావనతో బిల్‌గేట్స్ ఈ సూచన చేశారు. భారతదేశంలోని యువతను ఉద్దేశిస్తూ బిల్‌గేట్స్ ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. ఆయన చెప్పినదాని ప్రకారం ప్రయాణం చేయడం ద్వారా యువత వివిధ సంస్కృతులను, ఆర్థిక పరిస్థితులు(Financial conditions), సామాజిక వాస్తవాలను దగ్గరగా చూడగలుగుతుంది. ఇది వారిలో సానుభూతి, అవగాహన, బాధ్యతను పెంపొందిస్తుందని బిల్‌గేట్స్ భావించారు. ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశమైన భారతదేశంలో యువతకు అవకాశాలు అసమానతలతో కూడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అందుకే దానిని అర్థం చేసుకుంటే వారు జీవితంలో, సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి దోహదపడతారని ఆయన అభిప్రాయపడ్డారు. గేట్స్ ఈ సందర్భంగా భారతదేశం(India)లో జరుగుతున్న వేగవంతమైన ఆర్థిక పురోగతి, సాంకేతిక అభివృద్ధిని ప్రశంసించారు. అయితే ఈ పురోగతి సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందుబాటులో లేదని, యువత దానిని గుర్తించడం ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రయాణాలు సాగించడం ద్వారా యువత తమకంటే తక్కువ అవకాశాలు కలిగిన వారి జీవితాలను చూసి, వారికి సహాయం చేయడానికి లేదా సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రేరణ పొందుతుందని బిల్‌గేట్స్ పేర్కొన్నారు. గేట్స్ తరచూ విద్య, ఆరోగ్యంతో పాటు సమాజంలోని అసమానతలను తగ్గించడంపై దృష్టి సారిస్తుంటారు. భారతదేశంలోని యువత, దేశ భవిష్యత్తుకు కీలకమని, వారు సమాజంలోని సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారాల కోసం కృషి చేయాలని గేట్స్ సూచించారు. బిల్ గేట్స్ ఇచ్చిన ఈ సలహా భారతీయ యువత విజయం సాధించేందుకు, వారు సమాజంలోని ఇతరుల జీవన స్థితిగతులను అర్థం చేసుకునేందుకు దోహదపడుతుందనడంలో సందేహం లేదు.

# తరచూ బీహార్‌కు రాహుల్.. మహాకూటమి ప్లాన్ ఏమైనా..



**పట్నా:** బీహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు (Assembly elections) జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిద పార్టీలకు చెందిన రాజకీయ నేతలు, కార్యకర్తలు ఉత్సాహంతో కార్యరంగంలోకి దూకుతున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మూడు నెలల్లో మూడవసారి రాష్ట్రాన్ని సందర్శించడం పలు చర్చలకు దారితీస్తోంది. ఎన్డీఏ నేతృత్వంలోని బీహార్ సర్కారు(Bihar Government)ను అధికారం నుంచి దించే దిశగా రాహుల్ గాంధీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. తాజాగా బీహార్ యువతకు మద్దతుగా బెగుసరాయ్ జిల్లాలో కాంగ్రెస్ నిర్వహించిన 'పలాయన్ రోకో, నౌకరీ దో' పాదయాత్రలో రాహుల్ భాగస్వామ్యం వహించారు. ఇది కూడా ఆయన వ్యూహంలో భాగమేననే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ఈ పాదయాత్రకు ఎన్ఎస్‌యూఐ జాతీయ ఇన్‌చార్జ్ కన్హయ్య కుమార్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఒక వీడియో సందేశంలో 'బీహార్‌లోని యువ స్నేహితులారా, నేను ఏప్రిల్ 7న బెగుసరాయ్‌కు వస్తున్నాను. 'పలాయన్ రోకో, నౌకరీ దో' యాత్రలో మీతో కలిసి నడవడానికి సిద్ధంగా ఉన్నాను' అని పేర్కొన్నారు. గతంలో బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన వ్యూహం పలు విమర్శలను ఎదుర్కొంది. నాడు కాంగ్రెస్ పార్టీ ఆర్జేడీ(RJD)తో కలిసి 70 సీట్లలో పోటీ చేసినప్పటికీ, కేవలం 19 సీట్లు మాత్రమే దక్కించుకోగలిగింది. తాజాగా కాంగ్రెస్.. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ)తో కలిసి బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. దీనిని చూస్తుంటే బీహార్‌లో మరిన్ని సీట్లను సాధించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు పార్టీ నేతలు ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 'ఏ' టీమ్‌గా పోటీ చేస్తుందని, 'బి' టీమ్ కాదని స్పష్టం చేశారు.



# దేశవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

2025 ఏప్రిల్ 8 నుంచి అమలులోకి వచ్చేలా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 2 చొప్పున కేంద్రం సోమవారం పెంచింది. ప్రపంచ చమురు ధరలలో కొనసాగుతున్న హెచ్చుతగ్గులు, ట్రంప్ సుంకాల మధ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మంత్రిత్వ శాఖ వెల్లడించిన తన నోటిఫికేషన్‌లో.. పెరిగిన ఎక్సైజ్ సుంకం రిటైల్ ధరలను ఎప్పుడు, ఎలా ప్రభావితం చేస్తుందో వెల్లడించనప్పటికీ.. భారత వినియోగదారులపై దీని ప్రభావం ఉండదని ధృవీకరించింది. అంతర్జాతీయ చమురు ధరలు తగ్గడం వల్ల పెట్రోల్, డీజిల్ ధరలలో ఇటీవల తగ్గింపులతో ఎక్సైజ్ సుంకం పెరుగుదల సమతుల్యంగా ఉంటుందని భావిస్తున్నారు. భారతదేశంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చి 14న ఇంధన ధరలలో చివరి తగ్గింపు జరిగింది. ఎక్సైజ్ సుంకాన్ని రెండు సార్లు తగ్గించడంతో పెట్రోల్ & డీజిల్ ఎక్సైజ్‌ను లీటరుకు వరుసగా రూ. 13, రూ. 16 చొప్పున తగ్గించారు. ఇటీవల చమురు మంత్రి హర్దీప్ సింగ్ పూరి పెట్రోల్, డీజిల్ ధరలలో మరింత తగ్గింపు గురించి ఆశావాదం వ్యక్తం చేశారు, ఇది ప్రపంచ ముడి చమురు ధరలు ప్రస్తుత కనిష్ట స్థాయిలో ఉండటంపై ఆధారపడి ఉంటుందని అన్నారు.



## తారక్‌కి ప్రేమతో.. సుకుమార్ ఇంట్లో ఎన్టీఆర్

పుష్ప 2తో పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ కొట్టిన దర్శకుడు సుకుమార్ ప్రస్తుతానికైతే ఖాళీగానే ఉన్నాడు. 'పెద్ది' షూటింగ్ పూర్తయిన తర్వాత చరణ్ తో సినిమా చేయాల్సి ఉంది. అప్పటివరకు స్క్రిప్ట్ వర్క్ అంతా పూర్తి చేసుకోవచ్చు. మరోవైపు తారక్ కూడా వార్ 2 చేస్తున్నాడు. త్వరలో ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ లో జాయిన్ అవుతాడు. అలాంటిది ఇప్పుడు వీళ్లిద్దరూ కలిశారు. మరి సందర్భం ఏంటో తెలీదు గానీ సుకుమార్ ఇంటికి ఎన్టీఆర్ (Jr Ntr) వెళ్లాడు. ఈ విషయాన్ని సుక్కు భార్య తబిత ఇన్ స్టాలో పోస్ట్ చేశారు. 'తారక్ కి ప్రేమతో' అని సుకుమార్ భుజంపై తారక్ వాలి ఉన్న ఫొటోని పోస్ట్ చేశారు. దీన్ని తారక్ రీ పోస్ట్ చేయగా.. మళ్లీ దీన్ని సుకుమార్ రీ పోస్ట్ చేసి.. 'మై అభిరామ్' అని రాసుకొచ్చాడు. గతంలో సుకుమార్.. ఎన్టీఆర్ తో 'నాన్నకు ప్రేమతో' సినిమా తీశాడు. సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం హిట్ అయింది. మళ్లీ వీళ్లిద్దరూ ఎప్పుడు కలిసి పనిచేస్తారా అని ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ఇలాంటి టైంలో వీళ్లు కలవడం కొత్త ప్రాజెక్ట్ ఏమైనా ప్లాన్ చేస్తున్నారా అనే సందేహాలు రేకెత్తిస్తోంది.

## సోనూ సూద్ భార్యకు ప్రమాదం..

### అభిమానులకు హీరో సందేశం

బాలీవుడ్ నటుడు సోనూ సూద్ తెలుగువారికి సుపరిచితమైన పేరు. అరుంధతి సినిమాతో తెలుగు ప్రేక్షకులకు గుర్తుండిపోయారు. పలు సినిమాల్లో సహాయ నటుడు, విలన్ పాత్రలతో మెప్పించారు. సోనూసూద్ ప్రస్తుతం హిందీలో మాత్రమే మూవీస్ చేస్తున్నాడు. తన ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేదలకు అండగా నిలుస్తున్నారు.అయితే ఇటీవల సోనూ సూద్ భార్య సోనాలి ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఆమె ప్రయాణిస్తున్న కారును ట్రక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సోనాలితో పాటు మరికొందరికి గాయాలయ్యాయి. అయితే ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో అభిమానుల కోసం సోనూ సూద్ ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఇటీవల నా భార్యకు యాక్సిడెంట్ జరిగిన విషయం మీకు కూడా తెలుసని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ కారులో వెళ్లేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. సీట్ బెల్ట్ లేకపోతే.. మీరు మీ కుటుంబాన్ని కోల్పోయినట్లే అని సోనూ సూద్ తెలిపారు. మీరు వెనుక సీటులో కూర్చున్నప్పటికీ కూడా సీట్ బెల్ట్ ధరించాలని అభిమానులకు విజ్ఞప్తి చేశారు.



## విజయాల శ్రీలీల వెనుక రహస్యాలివే...



యువ నటి శ్రీలీల నిస్సందేహంగా భారతీయ సినీరంగంలో తదుపరి పెద్ద స్టార్ కానుంది అంటున్నాయి సినీజోస్యాలు. తన అందం, ఆకర్షణ, ఎలక్ట్రిఫైయింగ్ స్క్రీన్ ప్రెజెన్స్ అసాధారణమైన ఇతర నైపుణ్యాలతో, ఆమె దక్షిణాది సినీ పరిశ్రమలో అత్యంత డిమాండ్ ఉన్న నటీమణులలో ఒకరిగా మారింది. ఇప్పుడు కార్తీక్ ఆర్యన్ సరసన బాలీవుడ్‌లో అరంగేట్రం చేయడానికి సిద్ధమవుతోంది. పుష్ప2లోని కిస్సిక్ పాటతో ఆమె ఉత్తరాది ప్రేక్షకుల్ని ఒక ఊపు ఊపారు. నిజానికి పుష్ప తొలి భాగంలో సమంత ఐటమ్ సాంగ్ హిట్ అయినా కూడా సమంతకు రానంత పాప్యురారిటీ శ్రీలీలకు వచ్చింది. ఆ పాట ఆమె హిందీ చిత్రసీమలోకి రెడ్‌కార్పెట్ వేసింది. దాంతో సౌత్‌లోనూ ఆమె క్రేజ్ తారాస్థాయికి చేరుకుంది, ఇక ఆమె బాలీవుడ్‌లో మెరిసిపోతుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందుకు తగ్గట్టే...శ్రీలీల తాజా హిందీ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్స్ సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఇటీవల, ఈ చిత్రం సెట్ నుంచి అనేక వీడియోలు ఫొటోలు ఆనలైన్ లో ప్రత్యక్షమయ్యాయి. మరుసటి తక్షణమే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎరుపు రంగులో వదులుగా ఉండే దుస్తులు ధరించిన శ్రీలీల లుక్ ని, ఆమె రూపాన్ని మెచ్చుకుంటూ ఆమె పాత్ర గురించి ఊహాగానాలు చేస్తూ, అభిమానులు వీటిని షేర్ చేస్తున్నారు. ఓ రకంగా ఈ చిత్రానికి దక్షిణాదిలో విపరీతమైన టాక్ రావడానికి కారణం శ్రీలీలే అని చెప్పాలి. అందం, ప్రతిభ ఆత్మవిశ్వాసాల కలయికగా శ్రీలీల బాలీవుడ్‌లో రంగప్రవేశం చేస్తోంది. ఖచ్చితంగా కొన్నేళ్ల పాటు భారతీయ సినీరంగాన్ని ఊపే సత్తా ఆమెకు ఉందని బాలీవుడ్ మీడియా ఊహాగానాలు చేస్తోంది. ఈ సందర్భంగా శ్రీలీలను ఈ స్థాయిలో నిలబెట్టిన కొన్ని ముఖ్యమైను అంశాలను పరిశీలించాలి.. కన్నడ చిత్రం కిస్ (2019)తో శ్రీలీల మరపురాని అరంగేట్రం చేసింది, ఆమె సహజమైన సౌందర్యం, ప్రకాశవంతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ చిత్ర విజయం ఆమెకు కొత్త అవార్డులను సంపాదించిపెట్టింది, ఇది భారతీయ చలనచిత్రంలో ఆమె మంచి జర్నీకి నాంది పలికింది. రెండో విషయంగా చెప్పాల్సి వస్తే ఆమె నృత్య,నటనా ప్రతిభ గురించే చెప్పాలి. ధమాకా (2022)లో, జింతాక్ పాటలో చురుకైన రిథమ్, గ్రేస్ ఎక్స్‌ప్రెషన్స్ లతో శ్రీలీల తెలుగు సినిమాకి డాన్స్ డార్లింగ్‌గా మారింది. పెళ్లి సందడి (2021)లో సాంప్రదాయంగా కనపడి, భగవంత్ కేసరి (2023)లో యాక్షన్ సీన్స్ వరకు శ్రీలీల తనలోని షేడ్స్ స్కిల్స్ బాగా పండించింది. స్కంద (2023), ఆదికేశవ (2023), గుంటూరు కారం (2024) చిత్రాల జయాపజయాలతో సంబంధం లేకుండా విభిన్న పాత్రలతో తన స్కిల్స్‌కు సానబట్టింది. భాషపై పట్టు కూడా శ్రీలలకు అచ్చొచ్చిన మరో అంశం. కన్నడ, తెలుగు, తమిళం ఇంగ్లీషు భాషలపై ఆమెకున్న పట్టు ఆమెని విభిన్న భాషా చిత్రాల్లో, భిన్న పరిశ్రమల్లో బలంగా నిలబెట్టింది. వివిధ భాషా నేపథ్యాలకు చెందిన అభిమానులతో ఆమె సులభంగా మమేకం కాగలుగుతోంది. అంతర్జాతీయ ట్రెండ్స్‌ను ఒడిసిపట్టగల శ్రీలీల ఫ్యాషన్ ఐకాన్‌గా కూడా ఆకట్టుకోగలుగుతోంది. ఆమె వార్డ్‌రోబ్ ఫ్యాషన్ ప్రియుల ఫేవరెట్ గా పేరొందింది. అధిక ఫ్యాషన్‌తో యువత కు మరింత దగ్గర కాగలుగుతోంది. ఆమె ఫ్యాషన్ లుక్స్ ఆమెను మ్యాగజైన్‌లపై, వెబ్‌సైట్స్‌లో తళుక్కుమనేలా చేస్తున్నాయి. ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్ (2023) వంటి చిత్రాలలో పనిచేస్తున్నప్పుడు, శ్రీలీల తన వైద్య విద్య పరిజ్ఞానం గురించి ఆమె స్వచ్ఛంద సేవల గురించి బాగా వెలుగులోకి వచ్చింది.

ఆమె సహకారం అందిస్తున్న గ్రామీణ ఆరోగ్య కార్యక్రమాలు మహిళల విద్యకు మద్దతు అందించడం వంటివి ఆమెను నటిగా మాత్రమే కాక అంతకు మించి భారతీయ సినిమా రంగంలో ఒక ప్రత్యేకమైన రోల్ మోడల్‌గా అవతరించేందుకు అవకాశం అందిస్తున్నాయి.

# క్రీడా వార్తలు SPORTS NEWS



## చరిత్ర సృష్టించిన కింగ్ కోహ్లీ

- టీ20ల్లో అత్యధిక రన్స్ చేసిన ఫస్ట్ ఇండియన్‌గా రికార్డ్!
- టీ20 క్రికెట్ చరిత్రలోనే 13000
- పరుగులు సాధించిన తొలి భారత ప్లేయర్

**మహా:** విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. టీ20 క్రికెట్ చరిత్రలోనే 13000 పరుగులు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత సాధించాడు. ఐపీఎల్ 2025లో భాగంగా సోమవారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లేయర్ ఈ అరుదైన ఘనత సాధించాడు. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఐదో ప్లేయర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు 12,983 పరుగులతో ఉన్న విరాట్ ముంబయితో మ్యాచ్‌లో 17 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద 13,000 పరుగుల మార్క్ అందుకున్నాడు. 386 ఇన్నింగ్స్‌ల్లో విరాట్ ఈ ఘనత సాధించాడు. కోహ్లీ కంటే ముందు నలుగురు క్రికెటర్లు టీ20ల్లో 13 వేల రన్స్ పూర్తి చేశారు.



## ముంబై కంచుకోట బద్దలు


### పదేళ్ల తర్వాత ఆర్సీబీ గెలుపు

ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తిరిగి గెలుపు బాట పట్టింది. వాఖండే వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన హైస్కోరింగ్ థ్రిల్లర్‌లో 12 పరుగుల తేడాతో ఆర్సీబీ విజయం సాధించింది. 222 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేయగల్గింది. ముంబై బ్యాటర్లు ఆఖరి వరకు పోరాడినప్పటికి కొండంత లక్ష్యాన్ని కరిగించలేకపోయారు. ముంబై విజయానికి చివరి ఓవర్‌లో 19 పరుగులు అవసరమయ్యాయి. ఆర్సీబీ స్పిన్నర్ కృనాల్ పాండ్యా అద్భుతంగా బౌలింగ్ చేసి కేవలం 6 పరుగులు మాత్రమే ఇచ్చాడు. ముంబై బ్యాటర్లలో తిలక్ వర్మ(29 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 56) టాప్ స్కోరర్‌గా నిలవగా.. హార్దిక్ పాండ్యా(15 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 42) క్రీజులో ఉన్నంత సేపు మెరుపులు మెరిపించాడు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా నాలుగు వికెట్లు పడగొట్టగా.. హాజిల్ వుడ్, దయాల్ తలా రెండు వికెట్లు సాధించారు. వాంఖడేలో ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీ విజయం సాధించడం 10 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం.

### కోహ్లీ, పాటిదార్ హాఫ్ సెంచరీలు

ఈ మ్యాచ్‌లో ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ 5 వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆర్సీబీ బ్యాటర్లలో విరాట్ కోహ్లీ(67), రజిత్ పాటిదార్(64) హాఫ్ సెంచరీలు సాధించగా.. పడిక్కల్(37), జితేష్ శర్మ(40) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. ముంబై బౌలర్లలో బౌల్ట్, హార్దిక్ పాండ్యా తలా రెండు వికెట్లు సాధించగా.. విఘ్నేష్ ఒక్క వికెట్ పడగొట్టారు.

## హార్దిక్ పాండ్యా అరుదైన రికార్డు



ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. వాంఖడే వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో పాండ్యా రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. విరాట్ కోహ్లీ, లివింగ్ స్టోన్‌లను వరుస క్రమంలో పెవిలియన్‌కు పంపాడు. లివింగ్ స్టోన్ వికెట్ పాండ్యాకు 200వ టీ20 వికెట్ కావడం గమనార్హం. దీంతో ఓ అరుదైన ఫీట్‌ను పాండ్యా తన పేరిట లిఖించుకున్నాడు. టీ20 క్రికెట్‌లో 5000 పరుగులతో పాటు 200 వికెట్లు తీసిన తొలి భారత క్రికెటర్‌గా పాండ్యా నిలిచాడు. ఇప్పటివరకు ఏ ఇండియన్ క్రికెటర్ కూడా ఈ ఫీట్ సాధించలేదు. ఓవరాల్‌గా ఈ అరుదైన ఘనత సాధించిన 12వ ప్లేయర్‌గా పాండ్యా రికార్డు సృష్టించాడు. ఈ ఏడాది సీజన్‌లో పాండ్యా ఇప్పటివరకు 4 మ్యాచ్‌లు ఆడి 10 వికెట్లు పడగొట్టాడు. ఇక ఈ మ్యాచ్‌లో మొదటి బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ ఆర్సీబీ 5 వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఆర్సీబీ బ్యాటర్లలో విరాట్ కోహ్లీ(67), రజిత్ పాటిదార్(64) హాఫ్ సెంచరీలు సాధించగా.. పడిక్కల్(37), జితేష్ శర్మ(40) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. ముంబై బౌలర్లలో బౌల్ట్, హార్దిక్ పాండ్యా తలా రెండు వికెట్లు సాధించగా.. విఘ్నేష్ ఒక్క వికెట్ పడగొట్టారు.

**ఈ అరుదైన ఫీట్ సాధించిన ఆటగాళ్లు వీరే..**

డ్వేన్ బ్రావో 6970 పరుగులు 631 వికెట్లు
షకీబ్ అల్ హసన్ 7438 పరుగులు 492 వికెట్లు
ఆండ్రీ రస్సెల్ 9018 పరుగులు 470 వికెట్లు
మహ్మద్ నబీ 6135 పరుగులు 369 వికెట్లు
సమిత్ పటేల్ 6673 పరుగులు 352 వికెట్లు
కీరాన్ పొలార్డ్ 13537 పరుగులు 326 వికెట్లు
రవి బొపారా 9486 పరుగులు 291 వికెట్లు
డేనియల్ క్రిస్టియన్ 5848 పరుగులు 281 వికెట్లు
మోయిన్ అలీ 7140 పరుగులు 375 వికెట్లు
షేన్ వాట్సన్ - 8821 పరుగులు 343 వికెట్లు
మహ్మద్ హఫీజ్ - 7946 పరుగులు 202 వికెట్లు
హార్దిక్ పాండ్యా - 5390 పరుగులు 200 వికెట్లు

## ఆఖరిసారిగా అప్పుడే బాగా ఏడ్చాను: శ్రేయస్ అయ్యర్

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ2025 టైటిల్ టీమిండియా సొంతం కావడంలో శ్రేయస్ అయ్యర్‌ది కీలక పాత్ర. ఈ మిడిలార్డర్ బ్యాటర్ ఐదు మ్యాచ్‌లలోనూ అద్భుత ఆట తీరుతో రాణించి.. జట్టుకు వెన్నెముకగా నిలిచాడు. ఈ వన్డే టోర్నీలో మొత్తంగా 243 పరుగులు సాధించి భారత్ తరపున టాప్ రన్‌స్కోరర్‌గా నిలిచాడు. అయితే, ఈ మెగా ఈవెంట్‌కు ముందు శ్రేయస్ అయ్యర్‌కు తుదిజట్టులో చోటు దక్కే పరిస్థితే లేదు. ఈ టోర్నీకి ముందు ఇంగ్లండ్ (Ind vs Eng ODIs)తో స్వదేశంలో టీమిండియా మూడు వన్డేలు ఆడగా.. తొలి మ్యాచ్‌కు విరాట్ కోహ్లీ గాయం వల్ల దూరమయ్యాడు. ఫలితంగా శ్రేయస్ అతడి స్థానంలో ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. ఇక అప్పటి నుంచి అతడికి వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. వరుస మ్యాచ్‌లలో బ్యాట్ ఝులిపించి చాంపియన్స్ ట్రోఫీ జట్టులో స్థానం సంపాదించాడు. ఇక ఈ టోర్నీకి పాకిస్తాన్ ఆతిథ్యమివ్వగా.. భారత జట్టు మాత్రం తమ మ్యాచ్‌లన్నీ దుబాయ్ (Dubai)లో ఆడిన విషయం తెలిసిందే. అయితే, తొలి మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ బాగా ఏడ్చాడట. ఇందుకు గల కారణాన్ని అతడు తాజాగా వెల్లడించాడు. క్యాండిడ్ విత్ కింగ్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ పంజాబ్ కింగ్స్ కెప్టెన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "నేను చివరగా ఏడ్చిన సందర్భం అంటే.. చాంపియన్స్ ట్రోఫీ అప్పుడే. మొదటి ప్రాక్టీస్ సెషన్‌లో నేను సరిగ్గా ఆడలేకపోయాను. దాంతో ఏకధాటిగా ఏడుస్తూనే ఉన్నాను. అంతేకాదు.. నా మీద నాకు అంతులేని కోపం వచ్చింది. నిజానికి సాధరణంగా నేను అస్సలు ఏడ్వను. కానీ అప్పుడు ఎందుకు అంతలా బాధపడ్డానో నాకే తెలియదు. ఒక్కోసారి నాకు ఇది షాకింగ్‌గా అనిపిస్తుంది. అంతకు ముందు ఇంగ్లండ్ సిరీస్‌లో నేను బాగానే ఆడాను.





EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com